



22-05-2026

# విశాల భారతి

తెలుగు దినపత్రిక

www.vishalabharati.com
epaper.vishalabharati.com

శుక్రవారం, హైదరాబాద్ సంపుటి:4 సంచిక: 138



# విశాల భారతి

తెలుగు దినపత్రిక

23-05-2026

www.vishalabharati.com
epaper.vishalabharati.com

శనివారం, హైదరాబాద్ సంపుటి:4 సంచిక: 139





## ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం

2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ
రూ. 4.18 లక్షల తలసరి ఆదాయంతో దేశంలోనే టాప్
వడ్డీ లేని రుణాలు రూ. 10 లక్షలకు పెంపు
లక్ష్యం దాటి రూ. 1.68 లక్షల కోట్ల రుణాల పంపిణీ
ఫార్మా, టెక్స్టైల్ కొత్త ఇండస్ట్రియల్ హబ్‌ల ఏర్పాటు
ఫ్యూచర్ సిటీ, ఆర్ఆర్ఆర్, మూసీ పునరుజ్జీవనానికి ప్రాధాన్యత

06




## ఎంత ధాన్యం కొన్నారో చూపించండి

- మీతో ఎక్కడికంటే అక్కడికి వస్తాం
- ఎంత ధాన్యం కొన్నారో చూపించండి
- లేదా మాతో రండి.. మీరు చెప్పింది అబద్ధమని నిరూపిస్తాం
- రైతు గోస-బీజేపీ భరోసా యాత్ర చేయబోతున్నాం
- సోమవారం నుంచి కొనుగోలు కేంద్రాల్లో పర్యటిస్తాం
- బస్తాకు నాలుగు కిలోలు దోచుకుంటున్నారు

03

# ప్రజల గుండెల్లో కొలువై ఉన్న కోమటిరెడ్డి



**1965 మే 23న నల్లగొండ జిల్లాలో జన్మించారు**

జిల్లా వ్యాప్తంగా రహదారుల విస్తరణ, ఆధునీకరణ
ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం రాజీనామా
ఫ్లోరోసిస్ విముక్తి, కృష్ణా నీటి వాటా కోసం పోరాటాలు
రూ. 450 కోట్లతో నల్లగొండలో ప్రభుత్వ వైద్య కళాశాల
దివంగత కుమారుడి పేరిట ఉచిత విద్యా, వైద్య సేవలు

02

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో తిరుగులేని అగ్రనేత




## రేవంత్.. బుద్ధి తెచ్చుకో..!

వడ్ల కొనుగోళ్ల పై సచివాలయం వద్ద కవిత నిరసన, అరెస్ట్

వడ్లు కొనకుంటే మంత్రులు, ఎమ్మెల్యేలను తిరగనివ్వం
కల్లాల్లో రైతులు చస్తున్నా కాంగ్రెస్ సర్కారుకు పట్టదం లేదు
తరుగు, తేమ పేరిట రైతులను మిల్లర్లు మోసం చేస్తున్నారు
వ్యవసాయాన్ని పట్టించుకోని సీఎం రేవంత్ రాష్ట్రానికి దరిద్రం
సీఎం స్వయంగా కొనుగోలు కేంద్రాలకు వెళ్లి భరోసా ఇవ్వాలి

03

## సర్కార్ దవాఖానలో నిలువు దోపిడీ

హైదరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రుల్లో కిందిస్థాయి సిబ్బంది లంచాల వేధింపులు

నిమ్స్‌లో కిడ్నీ పేరిట రూ. 1.5 లక్షలు నొక్కిన ఉద్యోగి అరెస్ట్
స్ట్రెచర్, వార్డు ఎంట్రీల కోసం రూ. 50 నుండి రూ. 100 వసూలు
శవాల తరలింపు, పోస్టుమార్టం కోసం రూ. 5 వేల వరకు డిమాండ్
బాబు పుడితే రూ. 5 వేలు, పాప పుడితే రూ. 3 వేలు వసూలు
ఉస్మానియాలో గార్డు డబ్బులు లాగుతున్న కథనాలు వస్తున్నాయి

04






## నిమ్స్ వైద్యులను అభినందించిన సీఎం

- కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సల్లో నిమ్స్ ఘనత
- 2000 ఆపరేషన్లు పూర్తి చేసి దేశంలో మూడో స్థానంలో నిలిచిన ఆసుపత్రి
- వైద్య బృందాన్ని ప్రత్యేకంగా అభినందించిన సీఎం రేవంత్ రెడ్డి
- 95 శాతం ఆపరేషన్లు ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా నిర్వహించడం విశేషం
- దక్షిణ భారత దేశంలో కిడ్నీ మార్పిడులలో నిమ్స్ మొదటి స్థానం

05

## టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉత్తమ్ పద్మావతి?

- స్థానిక ఎన్నికల కోసం టీపీసీసీ కమిటీల నియామకంపై అధిష్ఠానం కసరత్తు
- ఎమ్మెల్యే పద్మావతి ఉత్తమ్‌కు వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి ఇచ్చే ఛాన్స్
- భర్త మంత్రిగా ఉన్నందున ప్రభుత్వ పదవి కాకుండా పార్టీ పదవి
- పద్మావతి నియామకంతో అటు మహిళ, ఇటు రెడ్డి సమీకరణాలు భర్తీ
- మిగిలిన మూడు స్థానాలను బీసీ, ఎస్సీ, ఎస్టీలతో భర్తీ చేయాలని పట్టు
- కమిటీల ద్వారా అసంతృప్త నేతల బుజ్జగింపు, క్యాడర్ సమాయత్తమే లక్ష్యం

04





## డిప్యూటీ కలెక్టర్ అవినీతి సామ్రాజ్యం

- డిప్యూటీ కలెక్టర్ వంశీమోహన్‌పై ఏసీబీ మెరుపు దాడులు
- వందల కోట్ల అక్రమాస్తులు గుర్తింపు
- ఆర్‌డీవోగా ఉన్నప్పుడు ప్రభుత్వ భూముల కాజేత

03

## ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రి తోడు దొంగలు

- రేవంత్, బండి సంజయ్ లాలూచీ రాజకీయం
- కేంద్ర మంత్రి కొడుకును కాపాడిన పోలీసులు
- దారుణాన్ని తొక్కిపెట్టిన ఛానళ్లు
- లా అండ్ ఆర్డర్ ఫెయిల్, కేసు నమోదులో తీవ్ర ఆలస్యం
- హైకోర్టు బెయిల్ తిరస్కరించడంతోనే లొంగిన నిందితుడు
- ఓటుకు నోటు దొంగే పోలీసులకు పాఠాలు చెప్పడం జోక్

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ పొలిటికల్ స్క్రీన్‌పై అధికార, ప్రతి పక్షాల మధ్య మాటల యుద్ధం సరికొత్త పీక్స్‌కు చేరింది. సమాజంలో ఒక వైపు నేరాల పరంపర సాగుతుంటే, మరోవైపు వ్యవస్థలు మూగనోము నోచాయంటూ సాగిన ప్రెస్ మీట్ పొలిటికల్ సర్కిల్స్‌ను షేక్ చేస్తోంది. శాంతిభద్రతల వైఫల్యాలను నిలదీస్తూ, పాలకుల లోపాయికారీ ఒప్పందాలను ఎండగట్టే మిగతా 4లో..





## ఫ్యూచర్ సిటీ రద్దు చేస్తాం

- ఫార్మా సిటీ మార్పుపై రేవంత్ సర్కార్ కాలయాపన డ్రామాలు
- బయట ఫ్యూచర్ సిటీ అంటూ, కోర్టులో ఫార్మా సిటీకే మొగ్గు
- నిబంధనలు మార్చి 75శాతం భూమిని వ్యాపారాలకు కట్టబెడుతున్నారు
- ప్రాజెక్ట్ పెట్టకుంటే చట్టప్రకారం భూములు రైతులకే ఇవ్వాలి
- బీఆర్ఎస్ రాగానే ఫ్యూచర్ సిటీ రద్దు, ఫార్మా సిటీ పునరుద్ధరణ
- రెండున్నరేళ్ల కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి పూర్తిగా శూన్యం

04

**విశాలభారతి:** ఉమ్మడి నల్లగొండ జిల్లా రాజకీయ యవనికపై తనదైన ముద్ర వేసి, ప్రజా హృదయాలలో చెరగని స్థానం సంపాదించుకున్న అగ్రనేత, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి నవశకానికి నాంది పలికారు. దశాబ్దాలుగా సాగుతున్న ఆయన రాజకీయ ప్రయాణం కేవలం పదవుల కోసం కాకుండా, ప్రాంతాభివృద్ధి, ప్రజా సంక్షేమమే పరమావధిగా సాగడం విశేషం. తెలంగాణ మలిదశ ఉద్యమంలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా జనం పక్షాన నిలిచిన పదునైన గొంతుకగా చరిత్ర సృష్టించిన ఆయన, ప్రస్తుతం రేవంత్ రెడ్డి మంత్రివర్గంలో కీలకమైన రోడ్లు, భవనాల శాఖతో పాటు సినిమాటోగ్రఫీ విభాగాల బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. రాజకీయాలలో ఒడుదొడుకులు సహజమే అయినప్పటికీ, నిలకడైన వ్యూహాలు, అపారమైన ప్రజాదరణతో నల్లగొండ నియోజకవర్గం నుండి ఐదుసార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించి జిల్లా రాజకీయాలను శాసిస్తూ భవిష్యత్తు తరాలకు ఆదర్శంగా నిలుస్తున్నారు. సబ్బండ వర్గాలలో సరికొత్త ఆశలను, నూతనోత్సాహాన్ని నింపుతూ 2026 నాటికి అభివృద్ధి పథంలో జిల్లాను అగ్రస్థానంలో నిలిపేందుకు అడుగులు వేస్తున్నారు.



# ప్రజల గుండెల్లో కొలువై ఉన్న కోమటిరెడ్డి

## 1965 మే 23న నల్లగొండ జిల్లాలో జన్మించారు

### ఉమ్మడి నల్లగొండ జిల్లాలో తిరుగులేని అగ్రనేత

- జిల్లా వ్యాప్తంగా రహదారుల విస్తరణ, ఆధునీకరణ
- ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం రాజీనామా
- ఫ్లోరోసిస్ విముక్తి, కృష్ణా నీటి వాటా కోసం పోరాటాలు
- రూ. 450 కోట్లతో నల్లగొండలో ప్రభుత్వ వైద్య కళాశాల
- దివంగత కుమారుడి పేరిట ఉచిత విద్యా, వైద్య సేవలు



## రూ. 3,500 కోట్లతో రహదారుల విస్తరణ

రహదారుల నెట్‌వర్క్ విస్తరణ ద్వారా గ్రామీణ ప్రాంతాల ఆర్థిక ముఖచిత్రాన్ని మార్చవచ్చని బలంగా నమ్మిన కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఆ దిశగా విప్లవాత్మక అడుగులు వేశారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా దాదాపు 3,500 కోట్ల రూపాయల భారీ వ్యయంతో రహదారుల విస్తరణ, ఆధునీకరణ పనులకు శ్రీకారం చుట్టి ప్రాంత రూపురేఖలను మార్చివేశారు. ప్రతి గ్రామానికి రవాణా సౌకర్యం కల్పించడంతో పాటు, జాతీయ రహదారులకు అనుసంధానం పెంచడం ద్వారా స్థానిక వ్యాపార, వాణిజ్య రంగాలకు పెద్దపీట వేశారు. రాష్ట్రవ్యాప్తంగా రహదారులు, భవనాలు, మౌలిక వసతుల కల్పనలో కీలక పాత్ర పోషిస్తున్న ఆయన చొరవ జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుకుంటోంది. రవాణా రంగంలో వస్తున్న ఈ సమూల



మార్పులు భవిష్యత్తులో జిల్లా పారిశ్రామిక ప్రగతికి బలమైన పునాదిగా మారతాయని విశ్లేషకులు భావిస్తున్నారు. రహదారుల ఆధునీకరణతో రవాణా వ్యయాలు గణనీయంగా తగ్గి గ్రామీణ ప్రాంత రైతాంగానికి సైతం ఊరట లభిస్తోంది.

## ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం పదవి త్యాగం



తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం మంత్రి పదవిని సైతం తృణప్రాయంగా త్యాగం చేసిన ఘనత కోమటిరెడ్డి వెంకటరెడ్డికి దక్కుతుంది. నాడు పదవుల కంటే ప్రాంత ప్రయోజనాలే ముఖ్యమని భావించి ఆయన తీసుకున్న నిర్ణయం ఉద్యమ చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిపోయింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఐటీ, కమ్యూనికేషన్స్, మౌలిక సదుపాయాల శాఖ మంత్రిగా పనిచేసిన అనుభవమున్న ఆయన, రాష్ట్ర సాధన కోసం ఆ పదవిని తృణప్రాయంగా వదిలేశారు. ఉమ్మడి జిల్లాలో సాగు, తాగునీటి ఎద్దడిని నివారించేందుకు జలసాధన సమితి ఆధ్వర్యంలో ఆయన చేపట్టిన ఆందోళనలు, నిరాహార దీక్షలు ఇక్కడి ప్రజల నీటి కష్టాలను తీర్చడంలో కీలక పాత్ర పోషించాయి. కృష్ణా నది జలాలలో తెలంగాణకు దక్కాల్సిన న్యాయమైన వాటాను సాధించడం కోసం ఆయన పార్లమెంట్ లోపల, బయట చేసిన పోరాటాలు ఇక్కడి రైతాంగానికి కొండంత అండగా నిలిచాయి. నల్లగొండ జిల్లాను ఫ్లోరోసిస్ మహమ్మారి నుంచి విముక్తి చేసేందుకు ఆయన సాగించిన సుదీర్ఘ పోరాటం శతాబ్దాల చరిత్రలో నిలిచిపోతుంది.




## ప్రతీక్ స్వచ్ఛంద సంస్థ ద్వారా విద్యా, వైద్య సేవలు

సామాజిక సేవా రంగంలో కోమటిరెడ్డి కుటుంబం అందిస్తున్న సేవలు యావత్ రాష్ట్రానికి ఆదర్శంగా నిలుస్తున్నాయి. తన కుమారుడు దివంగత ప్రతీక్ రెడ్డి జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన 'ప్రతీక్ ఫౌండేషన్' ద్వారా విద్యా, వైద్య రంగాలలో అద్భుతమైన సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. నల్లగొండలో బాలుర కోసం 3.50 కోట్ల రూపాయల వ్యయంతో 'ప్రతీక్ మెమోరియల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల', బాలికల కోసం ప్రత్యేక వృత్తి విద్యా నైపుణ్య కళాశాలను నిర్మించి ఉచిత విద్యను అందిస్తున్నారు. ఎలాంటి మౌలిక సదుపాయాలు లేని మారుమూల గ్రామీణ ప్రాంతాలలో ఉచిత కంటి వైద్య శిబిరాలు, ఆరోగ్య క్యాంపులు, కంటి శస్త్రచికిత్సల శిబిరాలు నిర్వహించి పేద ప్రజలకు వైద్య సహాయం అందిస్తున్నారు. ఈ సంస్థ ద్వారా ఉచిత అత్యవసర వైద్య వాహన సేవలు, రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిరంతరం సాగుతున్నాయి.



## బాల్యం, విద్యాభ్యాసం, వ్యక్తిగత వివరాలు

కోమటిరెడ్డి వెంకటరెడ్డి 1965 మే 23న నల్లగొండ జిల్లాలో పాపిరెడ్డి, సుశీలమ్మ దంపతులకు జన్మించారు. ఆయన ప్రాథమిక విద్యాభ్యాసం హైదరాబాద్ మలక్‌పేటలోని అమరజీవి పొట్టి శ్రీరాములు ఉన్నత పాఠశాలలో సాగింది, అక్కడ 1980లో పదిపరీక్షలు పూర్తి చేశారు. అనంతరం 1982లో పత్తర్‌ఘట్టీలోని ఎన్.బీ. సైన్స్ కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తి చేసి, 1986లో చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (సిబిఐటి) నుండి ఇంజనీరింగ్ పట్టా అందుకున్నారు. ఆయనకు లక్ష్మితో వివాహం జరగగా, వారికి ఒక కుమారుడు, ఒక కుమార్తె జన్మించారు. సుదీర్ఘ రాజకీయ ప్రయాణంలో ప్రజా సేవలోనే గడుపుతున్న ఆయనకు, లభించే కొద్దిపాటి ఖాళీ సమయాల్లో టేబుల్ టెన్నిస్ ఆడటం, ఈత కొట్టడం, దూరదర్శన్ లో చలనచిత్రాలు చూడటం ఎంతో ఇష్టం. ఆస్తి ప్రకటనల ప్రకారం ఆయన నికర ఆస్తుల విలువ 14.63 కోట్ల రూపాయలుగా ఉంది.

## రూ. 8 కోట్లతో పాఠశాల నిర్మాణం

నల్లగొండ పట్టణంలోని బొట్టుగూడలో గల ప్రభుత్వ పాఠశాలను మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తన కుమారుడు దివంగత ప్రతీక్ రెడ్డి జ్ఞాపకార్థం రూ.8 కోట్లతో అత్యాధునిక వసతులతో పునర్నిర్మించారు. 'కోమటిరెడ్డి ప్రతీక్ ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాల'గా పేరు మార్చబడిన ఈ పాఠశాల పేద విద్యార్థులకు ఉచితంగా అత్యుత్తమ విద్యను అందిస్తోంది. సుమారు 2,500 గజాల విస్తీర్ణంలో నిర్మించిన ఈ ఆధునిక విద్యా నిలయంలో వాల్డార్ఫ్ విద్యా విధానాన్ని అమలు చేస్తుండటం విశేషం. ఇక్కడ స్మార్ట్ క్లాసులు, కృతిమ మేధ బోధన, డిజిటల్ ప్రయోగశాలలు, డిజిటల్ గ్రంథాలయం వంటి అత్యాధునిక వసతులు కల్పించారు. తన మంత్రిత్వ హయాంలో నాణ్యమైన విద్యతో పాటు పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్మాణం, ఆధునిక వసతుల కల్పనకు ప్రాధాన్యతనిచ్చారు. ఆంగ్ల మాధ్యమంలో నాణ్యమైన విద్య అందుతుండటంతో, ప్రైవేట్ విద్యాసంస్థలకు దీటుగా ఉన్న ఈ పాఠశాలలో ప్రవేశాల కోసం తల్లిదండ్రులు భారీగా క్యూ కడుతున్నారు.





**ఉద్యమ పథంలో చారిత్రక నిరాహార దీక్ష**

తెలంగాణ జలాల సాధన కోసం, ప్రత్యేక రాష్ట్ర కాంక్షను ఢిల్లీ పాలకులకు చాటిచెప్పడం కోసం కోమటిరెడ్డి వెంకటరెడ్డి చేసిన పోరాటాలు అద్వితీయమైనవి. ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటును డిమాండ్ చేస్తూ 2011 నవంబరు 1 నుండి నల్లగొండ పట్టణ కేంద్రంగా తొమ్మిది రోజుల పాటు ఆయన చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష ఉద్యమ చరిత్రలోనే ఒక ప్రత్యేక ఘట్టంగా నిలిచిపోయింది. అంతకుముందు 2010లో ఒకసారి, 2011 అక్టోబరులో మరోసారి తన శాసనసభ సభ్యత్వానికి కూడా రాజీనామా చేసి స్వరాష్ట్రం పట్ల తనకున్న నిబద్ధతను చాటుకున్నారు. ప్రజా సంకల్పానికి అద్దం పడుతూ ఆయన నడిచిన ఈ పోరాట బాట, అప్పట్లో యావత్ తెలంగాణ సమాజంలో పెద్ద ఎత్తున ఆలోచనలను రేకెత్తించింది.

**దివ్యాంగుడికి తక్షణ సాయం..**
**సామాజిక మాధ్యమాల్లో ప్రశంసలు**

మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి నల్లగొండ జిల్లా పర్యటనలో భాగంగా రోడ్డుపై వెళ్తుండగా, ఒక దివ్యాంగుడు ఆవేదనతో నిలబడటం చూసి తన వాహన శ్రేణిని నిలిపివేశారు. ఆ దివ్యాంగుడు తన మూడు చక్రాల వాహనంలోని బ్యాటరీ పాడైపోయిందని, దాని పునరుద్ధరణకు 8,000 రూపాయల వ్యయం అవుతుందని తన గోడును వెళ్లబోసుకున్నాడు. వెంటనే స్పందించిన మంత్రి తన వద్ద ఉన్న 10,000 రూపాయల నగదును అందించి వాహనాన్ని బాగు చేయించుకోవాలని సూచించారు. దుర్వ్యసనాలకు దూరంగా ఉంటూ, ఆ బండిని సిద్ధం చేసుకుని తన వద్దకు తీసుకురావాలని ఆత్మీయంగా హితవు పలికారు. దీనికి సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాలలో విపరీతంగా ఆకట్టుకుంటూ ఆయన ప్రజా పక్షపాతానికి నిదర్శనంగా నిలిచాయి.



వైద్య విద్యా రంగానికి ఉమ్మడి నల్లగొండ జిల్లాను ఒక ప్రధాన కేంద్రంగా మార్చాలన్నది కోమటిరెడ్డి వెంకటరెడ్డి సుదీర్ఘకాల స్వప్నం. ఈ క్రమంలోనే నల్లగొండ జిల్లాకు ప్రభుత్వ వైద్య కళాశాలను మంజూరు చేయించడంలో ఆయన భగీరథ ప్రయత్నం చేశారు. దాదాపు 450 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మితమైన ఈ వైద్య కళాశాల, అనుబంధ ఆసుపత్రి

## రూ. 450 కోట్లతో ప్రభుత్వ వైద్య కళాశాల

నేడు వేలాది మంది పేద రోగులకు ఉచిత వైద్య సేవలను అందిస్తోంది. దీనికి తోడు జిల్లా కేంద్రంలో అత్యాధునిక సౌకర్యాలతో కూడిన విదేశీ తరహా బహిరంగ రోగుల విభాగం (ఓపీ బ్లాక్) నిర్మాణానికి నిధులు మంజూరు చేయించి, వైద్య సేవలను మరింత సులభతరం చేశారు. ఈ సంస్కరణలు జిల్లా వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులకు కారణమయ్యాయి. స్థానిక విద్యార్థులకు స్వగ్రామంలోనే వైద్య విద్యనభ్యసించే అరుదైన అవకాశం దీనివల్ల లభించింది.



**యువజన విభాగ అధ్యక్షుడి ప్రస్థానం**

యువజన విభాగ అధ్యక్షుడిగా తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన కోమటిరెడ్డి వెంకటరెడ్డి, క్షేత్రస్థాయి నుంచి నాయకుడిగా ఎదిగారు. విద్యార్థి దశ నుంచే ప్రజా సమస్యలపై పోరాడే గుణాన్ని అలవర్చుకున్న ఆయన, అతి చిన్న వయసులోనే శాసనసభకు ఎన్నికై రికార్డు సృష్టించారు. యువత ఆశయాలకు అనుగుణంగా ఉపాధి అవకాశాల కల్పన కోసం ఆయన నిరంతరం కృషి చేస్తూనే ఉన్నారు. జిల్లాలోని నిరుద్యోగ యువతకు సాంకేతిక నైపుణ్యాలలో శిక్షణ ఇప్పించి, వివిధ పరిశ్రమలలో ఉద్యోగ అవకాశాలు లభించేలా చూశారు. క్రీడారంగాన్ని ప్రోత్సహించడంలో భాగంగా గ్రామీణ ప్రాంతాలలో క్రీడా మైదానాల ఏర్పాటుకు నిధులు కేటాయించారు. యువతకు రాజకీయాలలో సరైన ప్రాధాన్యత కల్పించడంలో ఆయన ఎల్లప్పుడూ ముందుంటారు.

**వ్యవసాయ రంగ బలోపేతం, సాగునీటి ప్రాజెక్టులు**

వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన నాయకుడు కావడంతో కోమటిరెడ్డి వెంకటరెడ్డికి రైతుల కష్టాలపై పూర్తి అవగాహన ఉంది. ఉమ్మడి జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల ఆయకట్టు స్థిరీకరణ కోసం ఆయన అహర్నిశలు శ్రమిస్తున్నారు. మూసి ప్రాజెక్టు ఆధునికీకరణ పనులతో పాటు, ఎస్సారెస్పీ చివరి ఆయకట్టు భూములకు నీరందించేందుకు ప్రత్యేక కాలువల నిర్మాణాన్ని చేపట్టారు. దాదాపు 1.20 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్మిదేవిపల్లి రిజర్వాయర్ సాధన కోసం ఆయన చేస్తున్న పోరాటం ఇక్కడి రైతాంగ గుండెల్లో నిలిచిపోతుంది. ఎరువులు, విత్తనాల కొరత రాకుండా ముందస్తు ప్రణాళికలతో వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేస్తున్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించేలా మార్కెట్ యార్డులను ఆధునీకరిస్తున్నారు.

**పార్లమెంటరీ సేవలు, భువనగిరి అభివృద్ధి**

శాసనసభ్యుడిగానే కాకుండా పార్లమెంట్ సభ్యుడిగా కూడా కోమటిరెడ్డి వెంకటరెడ్డి తన ముద్ర వేశారు. 2019 లోక్‌సభ ఎన్నికలలో భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గం నుండి ప్రజా ప్రతినిధిగా ఎన్నికై, ఢిల్లీ వేదికగా తెలంగాణ సమస్యలపై గళం విప్పారు. తన నియోజకవర్గ పరిధిలోని రైల్వే లైన్ల విస్తరణ, జాతీయ రహదారుల అనుసంధానం, గ్రామీణ తాగునీటి సమస్యల పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చారు. పార్లమెంటరీ కమిటీలలో సభ్యుడిగా ఉంటూ వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి నిధుల సాధనలో కీలక పాత్ర పోషించారు. స్థానిక సమస్యలను జాతీయ స్థాయి పాలకుల దృష్టికి తీసుకువెళ్లి నిధులు రాబట్టడంలో ఆయన చూపిన చొరవ భువనగిరి నియోజకవర్గ ప్రగతికి ఎంతగానో దోహదపడింది.

**పారదర్శక పాలన, ప్రగతి దిక్సూచి**

మొత్తానికి కోమటిరెడ్డి వెంకటరెడ్డి రాజకీయ ప్రస్థానం ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రగతికి ఒక దిక్సూచిలా మారింది. పారదర్శకమైన పాలన, సామాజిక న్యాయ సాధనే ధ్యేయంగా ఆయన అడుగులు వేస్తున్నారు. పాత తరం అనుభవజ్ఞుల సలహాలను తీసుకుంటూనే, యువ నాయకత్వానికి ప్రాధాన్యత ఇస్తూ సమర్థవంతమైన బృందాన్ని తయారు చేసుకుంటున్నారు. కష్టాల్లో ఉన్న దివ్యాంగులకు, నిరుపేదలకు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు కంటికి రెప్పలా ఉంటూ నిరంతరం వ్యక్తిగత ఆర్థిక సహాయం అందిస్తూ అండగా నిలుస్తున్నారు. 2026 నాటికి నూతన సంస్కరణలతో అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేస్తూ అవినీతి రహిత సమాజ స్థాపనకు ఆయన వేస్తున్న అడుగులు అభినందనీయం. రాబోయే రోజుల్లో ఆయన నాయకత్వంలో జిల్లా మరిన్ని ఆదర్శవంతమైన మైలురాళ్లను అధిగమించడం ఖాయంగా కనిపిస్తోంది.

# డిప్యూటీ కలెక్టర్ అవినీతి సామ్రాజ్యం

- డిప్యూటీ కలెక్టర్ వంశీమోహన్‌పై ఏసీబీ మెరుపు దాడులు
- వందల కోట్ల అక్రమాస్తులు గుర్తింపు
- ఆర్డీవోగా ఉన్నప్పుడు ప్రభుత్వ భూములు కాజేత
- 8 ఎకరాల ప్రభుత్వ భూమి మామ పేరుపైకి మార్పిడి
- కబ్జా భూమిని రియల్టర్‌కు అమ్మి 8 ప్లాట్లు వసూలు
- పలు కంపెనీల్లో పెట్టిన పెట్టుబడులపై ఏసీబీ ఆరా



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** అవినీతి సామ్రాజ్యంలో అతడో సరికొత్త రికార్డు సృష్టించాడు. సాధారణంగా లంచాలు తీసుకునే అధికారులు నగదు, బంగారం, విలాసవంతమైన వస్తువులతో సరిపెట్టుకుంటారు. ఈ ప్రభుత్వ అధికారి మాత్రం అంతకుమించి అన్నట్లుగా వ్యవహరించాడు. ఏకంగా వందల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములను తన గుప్పిట్లోకి తెచ్చుకున్నాడు. ఆస్తులను రకరకాల రూపాల్లోకి మార్చి దర్జాగా అనుభవించాడు. చట్టం కన్నుగప్పి సాగించిన ఈ సుదీర్ఘ అక్రమ సంపాదన పర్వానికి ఎట్టకేలకు తెరపడింది. పాపం పండటంతో ఏసీబీ అధికారుల చేతికి చిక్కాడు. తెలంగాణ అవినీతి నిరోధక శాఖ అధికారులు మరోసారి మెరుపు దాడితో విరుచుకుపడ్డారు. వ్యవస్థను పట్టిపీడిస్తున్న ఓ భారీ అనకొండను శుక్రవారం నాడు వలపన్ని పట్టుకున్నారు. నిందితుడు కూడబెట్టిన అక్రమ ఆస్తుల వివరాలు చూసి దర్యాప్తు అధికారులే ఒక్కసారిగా దిగ్భ్రాంతికి గురయ్యారు. అతడు సంపాదించిన ఆస్తులు, వాటిని నగదు రూపంలోకి మార్చుకున్న విధానం చూసి అధికారులు నివ్వెరపోయారు. గత కొద్ది రోజులుగా ఈ అధికారి కదలికలపై నిఘా ఉంచిన ఏసీబీ బృందం, పక్కా ఆధారాలు సేకరించిన తర్వాతే రంగంలోకి దిగింది. శుక్రవారం ఉదయం నుంచే ఏకకాలంలో దాడులు ప్రారంభించింది. మేడ్చల్ మాల్కాజ్ గిరి జిల్లాలో డిప్యూటీ కలెక్టర్ గా విధులు నిర్వహిస్తున్న వంశీమోహన్ ఇల్లే లక్ష్యంగా ఈ సోదాలు జరిగాయి. ఆయన నివాసంలో సోదాలు చేసిన ఏసీబీ అధికారులు దాదాపు 300 కోట్ల రూపాయలకు పైగా విలువైన ఆస్తులను గుర్తించారు. హైదరాబాద్ నగర శివారు ప్రాంతమైన శేరిలింగంపల్లి పరిధిలో ఈ అధికారి భారీగా ప్రభుత్వ భూములను స్వాహా చేసినట్లు దాడుల్లో తేలింది. గతంలో శేరిలింగంపల్లి ప్రాంతంలో ఆర్డీవోగా బాధ్యతలు నిర్వర్తించిన సమయంలోనే ఈ అక్రమాలకు తెరలేపాడు. అధికార బలాన్ని ఉపయోగించి విలువైన భూములను దండుకున్నాడు. రాష్ట్ర రాజధాని పరిసరాల్లో భూములకు ఉన్న విపరీతమైన డిమాండ్ ను ఈ అధికారి తన స్వలాభానికి వాడుకున్నాడు. అబ్దుల్లాపూర్ మెట్, పిగ్లీపురం పరిధిలోని 8 ఎకరాల ప్రభుత్వ భూమిని రికార్డుల్లో తారుమారు చేశాడు. ఆ విలువైన భూమిని తన మామ పేరిట అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించాడు. ఆ తర్వాత సదరు భూమిని ఒక ప్రముఖ స్థిరాస్తి వ్యాపారికి విక్రయించాడు. ఆ విక్రయ ఒప్పందంలో భాగంగా దాదాపు 8 విల్లా ప్లాట్లను గిఫ్ట్ డీడ్ రూపంలో తిరిగి తన కుటుంబ సభ్యుల పేర్లపై రాయించుకున్నాడు. ఇలా ప్రభుత్వ భూమితోనే వందల కోట్ల రూపాయల వ్యాపారం సాగించాడు. వంశీమోహన్ నివసిస్తున్న విలాసవంతమైన భవనాన్ని చూసి అధికారులు ఆశ్చర్యపోయారు. ఇంటీరియర్ డిజైనింగ్ కోసమే లక్షలాది రూపాయలు వెచ్చించినట్లు సమాచారం. ఇంట్లో లభించిన దస్తావేజుల ప్రకారం నగరంలోని ప్రధాన ప్రాంతాల్లో ఖరీదైన స్థలాలు కొనుగోలు చేశాడు. సాధారణ ప్రభుత్వ జీతంతో ఇవన్నీ సాధ్యం కాదన్న ప్రాథమిక అంచనాతోనే ఏసీబీ రంగంలోకి దిగింది. నిందితుడు కేవలం భూముల రూపంలోనే కాకుండా కొన్ని ప్రముఖ ఐటీ, ఫార్మా కంపెనీలలో భారీగా పెట్టుబడులు పెట్టినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలింది. ఆయా సంస్థల ఆర్థిక లావాదేవీలపై అధికారులు లోతుగా ఆరా తీస్తున్నారు. అవినీతి అధికారి నివాసంలో లభించిన డైరీలు, బ్యాంక్ ఖాతాల వివరాలను అధికారులు పరిశీలిస్తున్నారు. మొత్తం 12 బ్యాంక్ ఖాతాలను గుర్తించి, వాటిని తాత్కాలికంగా స్తంభింపజేశారు. ఆయా ఖాతాల్లో ఉన్న నిల్వలు, లాకర్లలో దాచిన డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నారు. విదేశీ ప్రయాణాలకు సంబంధించిన వివరాలు, కొన్ని బినామీ పేర్లతో సాగించిన లావాదేవీల పత్రాలు లభ్యమయ్యాయి. ఈ తనిఖీల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. రక్షణ చర్యల్లో భాగంగా స్థానిక పోలీసుల సాయాన్ని ఏసీబీ అధికారులు తీసుకున్నారు. రెవెన్యూ శాఖలో సుదీర్ఘ కాలం పనిచేసిన అనుభవాన్ని వంశీమోహన్ అక్రమ సంపాదనకు పెట్టుబడిగా మార్చుకున్నాడు. భూ రికార్డుల నిర్వహణలో ఉన్న లోపాలను ఆసరాగా చేసుకుని ప్రభుత్వ నిషేధిత భూముల జాబితా నుంచి కొన్ని సర్వే నంబర్లను తొలగించాడు. ఆ తర్వాత వాటిని ప్రైవేటు వ్యక్తుల పేర్లపైకి మారుస్తూ ఉత్తర్వులు జారీ చేశాడు. ఇందుకు ప్రతిఫలంగా సదరు లబ్ధిదారుల నుంచి కోట్లాది రూపాయల నగదును చేతులు మార్చాడు. ఈ వ్యవహారంలో సదరు డిప్యూటీ కలెక్టర్ కు సహకరించిన మరి కొందరు కింది స్థాయి సిబ్బంది పాత్రపై కూడా అధికారులు దృష్టి సారించారు. ఏసీబీ చరిత్రలోనే ఇది ఒక అతి పెద్ద భూ కుంభకోణంగా అధికారులు భావిస్తున్నారు. పట్టుబడిన ఆస్తుల విలువ మార్కెట్ ధర ప్రకారం 400 కోట్ల రూపాయల వరకు ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. దాడుల సందర్భంగా స్వాధీనం చేసుకున్న కంప్యూటర్ హార్డ్ డిస్కులు, మొబైల్ ఫోన్లలోని సమాచారాన్ని విశ్లేషిస్తున్నారు. అక్రమ సంపాదనతో కొనుగోలు చేసిన వాహనాల వివరాలను సేకరించారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని ఏసీబీ ప్రత్యేక కార్యాలయానికి తరలించారు. అక్కడ ఉన్నతాధికారుల సమక్షంలో విచారణ కొనసాగుతోంది. ఇలాంటి అవినీతి తిమింగలాల వల్ల ప్రభుత్వ ఖజానాకు గండి పడటంతో పాటు నిజమైన లబ్ధిదారులకు అన్యాయం జరుగుతోంది. శేరిలింగంపల్లి లాంటి ప్రాంతాల్లో పేదలకు చెందాల్సిన భూములను ఈ అధికారి ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టడంపై ప్రజల నుంచి తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. గతంలో ఇతనిపై వచ్చిన అనేక ఫిర్యాదుల ఆధారంగానే ఏసీబీ నిఘా విభాగం రహస్య విచారణ చేపట్టింది. అన్ని ఆధారాలు పక్కాగా సేకరించిన తర్వాతే కోర్టు అనుమతితో ఈ దాడులు నిర్వహించారు. నిందితుడిపై అవినీతి నిరోధక చట్టం కింద కేసు నమోదు చేశారు. అవినీతికి పాల్పడే వారు ఎంతటి వారైనా సరే వదిలిపెట్టే ప్రసక్తే లేదని ఏసీబీ ఉన్నతాధికారులు స్పష్టం చేశారు. ఈ కేసులో మరిన్ని అరెస్టులు జరిగే అవకాశం ఉందని సమాచారం. నిందితుడి బినామీల ఇళ్లలో కూడా ఏకకాలంలో సోదాలు కొనసాగుతున్నాయి. స్వాధీనం చేసుకున్న డాక్యుమెంట్ల ఆధారంగా తదుపరి చర్యలు ఉంటాయని అధికారులు వెల్లడించారు. ఈ అక్రమ భూ బదలాయింపుల వ్యవహారంలో రిజిస్ట్రేషన్ శాఖ అధికారుల పాత్రపైనా విచారణ జరుపుతున్నారు. ఈ భారీ దాడి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ అధికారుల్లో తీవ్ర కలకలం రేపింది.

# రేవంత్.. బుద్ధి తెచ్చుకో..!

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

హైదరాబాద్ మహానగర గుండెకాయ లాంటి సచివాలయం సాక్షిగా అన్నదాతల ఆక్రందనలు మిన్నంటాయి. పండించిన ప్రతి గింజనూ కొనుగోలు చేయాలంటూ నినదిస్తూ తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కల్వకుంట్ల కవిత సరికొత్త పోరాట శంఖారావాన్ని పూరించారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా సెక్రటేరియట్ ప్రధాన రహదారిపై వడ్లు కుమ్మరించి నిర్వహించిన ఈ ధర్నా డిజిటల్ మాధ్యమాల్లో పెను సంచలనంగా మారింది. శాంతియుతంగా సాగుతున్న ఆందోళనను అణచివేసేందుకు ఖాకీ బలగాలు రంగంలోకి దిగడంతో పరిసర ప్రాంతాలన్నీ తీవ్ర ఉద్రిక్తతకు లోనయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా సాగుతున్న ధాన్యం కొనుగోళ్ల ప్రహసనంపై కాంగ్రెస్ సర్కారు ప్రదర్శిస్తున్న ఉదాసీనతను కల్వకుంట్ల కవిత తీవ్రస్థాయిలో ఎండగట్టారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికైనా తన మొండివైఖరి వీడి కొనుగోలు కేంద్రాలను స్వయంగా సందర్శించాలని డిమాండ్ చేశారు. కల్లాల్లో వడ్లు ఎండిపోతున్నా, అకాల వర్షాలకు తడిసి ముద్దవుతున్నా పాలకుల్లో కనీస చలనం లేకపోవడం దారుణమన్నారు. వానాకాలం ముంచుకొచ్చే ముందే కొనుగోళ్లు పూర్తి చేయకుంటే ప్రభుత్వ మంత్రులు, ఎమ్మెల్యేలు గ్రామాల్లో తిరగలేని పరిస్థితులు ఎదుర్కొంటారని హెచ్చరించారు. సచివాలయం ముందు సాగిన ఈ వడ్ల నిరసన కేవలం ఒక హెచ్చరిక మాత్రమేనని తెలంగాణ రక్షణ సేన స్పష్టం చేసింది. ఆరుగాలం కష్టపడి పంట పండించిన రైతుకు బాసటగా నిలిచే కనీస బాధ్యత కూడా ఈ పాలకులకు లోపించిందని కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. కల్లాల్లోనే కాపలా కాస్తూ ఎండ దెబ్బకు తట్టుకోలేక కొందరు అన్నదాతలు ఊపిరి వదులుతున్నా ప్రభుత్వానికి పట్టింపు లేదు. అకాల వర్షాల వల్ల తడిసిన ధాన్యం, మక్కలు, పొద్దుతిరుగుడు, జొన్నల పంటలను ఆరబెట్టుకుంటూ రైతులు కాంటా కోసం కళ్లల్లో ఒత్తులు వేసుకుని చూస్తున్నారు. ఐదు శాతానికి పైగా తేమ సాకుతో కొనుగోళ్లను కావాలనే ఆలస్యం చేస్తూ మిల్లింగ్ మాఫియాకు ప్రభుత్వం కొమ్ముకాస్తోందని కవిత ఆరోపించారు. క్షేత్రస్థాయిలో తూకంలో భారీగా తరుగు తీస్తూ రైతుల పొట్ట కొడుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఏ గ్రేడ్ రకం ధాన్యానికి కూడా రంగు మారింది, తాలు ఉందంటూ బి గ్రేడ్ ధర కడుతూ మిల్లర్లు నిలువుదోపిడీకి పాల్పడుతున్నారు. లక్షలాది మంది రైతుల జీవితాలు రోడ్డున పడుతున్నా సరే పౌరసరఫరాల శాఖ, మార్కెటింగ్ విభాగాలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం శోచనీయం. గడిచిన కొన్ని నెలలుగా రాష్ట్రంలో వ్యవసాయ శాఖపై కనీస సమీక్ష కూడా నిర్వహించని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరును ఆమె తీవ్రంగా తప్పుబట్టారు. పరిపాలనలో కనీస ప్రాథమికాంశాలు విస్మరించి రాజకీయ కక్షసాధింపులకే కాంగ్రెస్ ప్రాధాన్యత ఇస్తోందని మండిపడ్డారు. ఇప్పటికైనా సర్కారు మేల్కొని ప్రతి కొనుగోలు కేంద్రంలో మౌలిక వసతులు కల్పించి ఐకేపీ సెంటర్ల ద్వారా వేగంగా సేకరణ జరపాలని డిమాండ్ చేశారు. రైతులకు ప్రకటించిన రూ.500 బోనస్ హామీని తక్షణమే అమలు చేసి అన్నదాతల అకౌంట్లలో నగదు జమ చేయాలన్నారు. సచివాలయం వద్ద ధర్నా సమాచారం అందుకున్న పోలీసులు వందలాది మందిగా తరలి వచ్చి ఆందోళనకారులను అడ్డుకునే ప్రయత్నం చేశారు. కల్వకుంట్ల కవితతో పాటు నిరసనకు దిగిన పార్టీ ముఖ్య నాయకులను, మహిళా కార్యకర్తలను బలవంతంగా లాగి వాహనాల్లోకి ఎక్కించారు. అరెస్టుల పర్వంతో సచివాలయ పరిసరాలు రణరంగాన్ని తలపించగా, ట్రాఫిక్ గంటల తరబడి నిలిచిపోయింది. కవితను అరెస్ట్ చేసి ఫలక్‌నుమా పోలీస్ స్టేషన్‌కు తరలించినప్పటికీ, ప్రభుత్వానికి వ్యతిరేకంగా హూంకరిస్తూ సేన శ్రేణులు నినాదాలు కొనసాగించాయి.




తెలంగాణ రక్షణ సేన స్థాపించిన స్వల్ప కాలంలోనే రైతుల పక్షాన ఇంతటి భారీ ఆందోళన చేపట్టడం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. జెన్ జీ యువత, రైతాంగ సార్వభౌమత్వమే లక్ష్యంగా ప్రయాణిస్తున్న తమ పార్టీని లాఠీలతో అణచలేరని కవిత స్పష్టం చేశారు. కేవలం డెస్క్ మేనేజ్‌మెంట్లు, ప్రచార ఆర్భాటాలకే కాంగ్రెస్ పరిమితమైందని క్షేత్రస్థాయిలో రైతుల గోస చూస్తే ఆకలి కేకలు వినిపిస్తున్నాయన్నారు. క్వింటాకు తరుగు పేరిట ఐదు కిలోల వరకు అన్యాయంగా కట్ చేస్తున్నా ఏ ఒక్క అధికారీ మిల్లులపై చర్యలు తీసుకోవడం లేదు. కొనుగోలు కేంద్రాల వద్ద తాగునీరు, నీడ సదుపాయాలు లేక వృద్ధులైన రైతులు వడదెబ్బకు గురవుతున్న పరిస్థితులను కవిత వివరించారు. రాష్ట్రంలో సుమారు ముప్పై లక్షల టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా పెట్టుకున్న ప్రభుత్వం, కనీసం పది శాతం కూడా పూర్తి చేయలేకపోయింది. గిట్టుబాటు ధర దక్కక, దళారుల చేతుల్లో మోసపోతున్న కౌలు రైతుల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. వ్యవసాయ సంక్షోభాన్ని పరిష్కరించడంలో విఫలమైతే కాంగ్రెస్ పతనం ఇక్కడి నుంచే ప్రారంభమవుతుందని ధ్వజమెత్తారు. పోలీస్ స్టేషన్ నుంచే కవిత తన తదుపరి కార్యాచరణను ప్రకటిస్తూ, రాబోయే రోజుల్లో ప్రతి జిల్లా కలెక్టరేట్ ఎదుట నిరసనలు ఉంటాయన్నారు. రైతుల పండించిన జొన్నలు, మక్కలను సైతం ప్రభుత్వమే నేరుగా కొనుగోలు చేసి మద్దతు ధర చెల్లించే వరకు విశ్రమించే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. తెలంగాణ గడ్డపై కాంగ్రెస్ మంత్రులు స్వేచ్ఛగా తిరగాలంటే మొదట కల్లాల్లో ఉన్న ధాన్యం కుప్పలను ఖాళీ చేయించాల్సిందేనని డిమాండ్ చేశారు. ఈ వడ్ల పోరాటం కేవలం ప్రారంభం మాత్రమేనని, రైతు రాజ్యం వచ్చే వరకు పోరు సాగుతుందన్నారు. రైతుల కన్నీళ్లకు కారణమైన ఏ ప్రభుత్వమూ చరిత్రలో నిలిచిన దాఖలాలు లేవని, రేవంత్ సర్కారుకు కూడా అదే గతి పడుతుందని కవిత హెచ్చరించారు. అక్రమ అరెస్టులతో తమ గొంతు నొక్కలేరని, ప్రజల మద్దతుతో తమ నిరసనలను మరింత ఉధృతం చేస్తామని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సచివాలయం ముందు పోసిన ప్రతి వడ్ల గింజా కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యానికి సాక్ష్యంగా నిలుస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ పరిణామాలు రాబోయే రోజుల్లో రాష్ట్ర రాజకీయాల్లో ఎలాంటి మార్పులకు దారితీస్తాయో వేచి చూడాలి.

# పాఠశాలల వద్ద రద్దీకి 'స్టూడెంట్ మొబిలిటీ ప్లాన్'

**500 విద్యాసంస్థలతో సైబరాబాద్ పోలీసుల సమావేశం టెక్నాలజీతో పరిష్కారం**

**సైబరాబాద్ - విశాల భారతి**

సైబరాబాద్ పరిధిలో పాఠశాలలు, కళాశాలల వద్ద ఉదయం, సాయంత్రం వేళల్లో నిత్యం ఏర్పడుతున్న తీవ్ర ట్రాఫిక్ రద్దీకి శాశ్వత పరిష్కారం చూపేందుకు సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్, సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ సంయుక్తంగా 'స్టూడెంట్ మొబిలిటీ ప్లాన్'ను రూపొందించాయి. ఇందులో భాగంగా శుక్రవారం హైదరాబాద్‌లోని ఈఎస్‌సీఐ సెంటినరీ కన్వెన్షన్ సెంటర్‌లో 500కు పైగా విద్యాసంస్థలకు చెందిన 750 మంది ప్రతినిధులతో భారీ అవగాహన సదస్సు నిర్వహించారు. టీజీఎస్ఆర్టీసీ, సీఎంసీ, ఆర్టీఏ, విద్యాశాఖ అధికారులు, రవాణా ఆపరేటర్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. విద్యార్థుల రవాణా తీరుతెన్నులపై సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు, ఎస్‌సీఎస్‌సీ బృందాలు కలిసి 526 విద్యాసంస్థల్లో క్షేత్రస్థాయి సర్వే చేపట్టాయి. మొత్తం 4.1 లక్షల మంది విద్యార్థుల రాకపోకలను పరిశీలించిన ఈ సర్వేలో కీలక అంశాలు




వెలుగుచూశాయి. 80 శాతం విద్యాసంస్థలు బస్సు సౌకర్యం కల్పిస్తున్నప్పటికీ కేవలం 30 శాతం మంది విద్యార్థులే ఆ సౌకర్యాన్ని వినియోగిస్తున్నారు. దీని కారణంగా ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో సుమారు రెండు లక్షల ప్రైవేటు వాహనాలు పాఠశాలల వద్దకు చేరుతున్నాయి. పీక్ సమయంలో కేవలం 15 నిమిషాల వ్యవధిలోనే రెండు లక్షల వాహనాలు రోడ్డెక్కడం సైబరాబాద్ ఐటీ కారిడార్ రద్దీని మించిపోతోందని అధికారులు గుర్తించారు. ఈ సందర్భంగా సైబరాబాద్ పోలీస్ కమిషనర్ ఎం. రమేశ్ మాట్లాడుతూ పిల్లలను పాఠశాలలకు దింపేందుకు, తిరిగి తీసుకెళ్లేందుకు తల్లిదండ్రులు తొందరపడి ప్రమాదకరంగా వాహనాలు నడుపుతున్నారని, దీంతో పలు ప్రమాదాలు, కొన్ని సందర్భాల్లో మరణాలు కూడా సంభవించాయని ఆవేదన వ్యక్తం చేశారు. సమాచార లోపం కారణంగా పిల్లలు పాఠశాలల్లో చిక్కుకుపోవడం, ఉదయం హడావుడిలో పిల్లల ఆరోగ్యం దెబ్బతినడం వంటి సమస్యలు తలెత్తుతున్నాయని తెలిపారు. ఇది స్వల్పకాలిక ట్రాఫిక్ సమస్య కాదని, దీర్ఘకాలిక పౌర రవాణా సంస్కరణ అవసరమని స్పష్టం చేశారు. ప్రస్తుతం పూర్తిగా వినియోగంలో లేని ప్రభుత్వ, ప్రైవేటు రవాణా సామర్థ్యాన్ని వాడుకుని పూల్డ్ మొబిలిటీని ప్రోత్సహిస్తామని, పాఠశాలలకు వచ్చే అన్ని వాహనాలు నిబంధనలకు లోబడి ఉండేలా చూస్తామని చెప్పారు. అంతేకాకుండా లాస్ట్ మైల్ కనెక్టివిటీలో గిగ్ వర్కర్లు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలను భాగస్వామ్యం చేసి విద్యార్థుల భద్రతను మరింత పటిష్ఠం చేయడంతో పాటు వారికి అదనపు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని వెల్లడించారు. శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ నారాయణ అమిత్ మాట్లాడుతూ విద్యార్థి భద్రత పాఠశాల గేటు వద్దే ముగియదని, ఇంటి నుంచి బయలుదేరిన క్షణం నుంచి తిరిగి సురక్షితంగా చేరే వరకు ఉంటుందని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో కనిపించే మార్పు కోసం కమిషనరేట్ తో కలిసి పనిచేస్తామని తెలిపారు. ఎస్‌సీఎస్‌సీ సీఈవో నవేద్ ఖాన్ మాట్లాడుతూ రోడ్డుపై వాహనాల సంఖ్యను గణనీయంగా తగ్గిస్తూ విద్యార్థులకు సురక్షితమైన, అందరికీ అందుబాటులో ఉండే రవాణా వ్యవస్థను అందించడమే ఈ ప్రణాళిక ప్రధాన లక్ష్యమని వివరించారు. టీజీఎస్ఆర్టీసీ డిప్యూటీ రీజినల్ మేనేజర్ అపర్ణ కళ్యాణి మాట్లాడుతూ సంస్థ డ్రైవర్లకు నిర్మాణాత్మక శిక్షణ ఇస్తున్నామని, బస్సులన్నీ భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నాయని, విద్యార్థులు ఎక్కడి నుంచి ప్రయాణిస్తున్నారో స్పష్టత ఉంటే సమన్వయం మరింత సులభమవుతుందని అభిప్రాయపడ్డారు.

# ఎంత ధాన్యం కొన్నారో చూపించండి

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

రాష్ట్రంలో వరి ధాన్యం కొనుగోళ్ల అంశం అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీజేపీ మధ్య తీవ్ర రాజకీయ విమర్శలకు దారితీసింది. ప్రభుత్వం 80 శాతం వడ్లు కొనుగోలు చేసిందంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించిన గణాంకాలు పూర్తిగా అవాస్తవమని బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు కేవలం 24 శాతమే వరి కొనుగోళ్లు జరిగాయని ఆయన స్పష్టం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డికి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వాస్తవ పరిస్థితులను చూపిస్తామని, ఆయన ఎక్కడికి రమ్మంటే అక్కడికి రావడానికి తాము సిద్ధంగా ఉన్నామని సవాల్ విసిరారు. తప్పుడు లెక్కలతో, మాటల గారడీతో ప్రజలను, రైతాంగాన్ని మభ్యపెట్టడం మానుకోవాలని హితవు పలికారు. హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను సకాలంలో కొనుగోలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. ప్రభుత్వ ఉదాసీనత వల్ల రైతులు దళారుల చేతిలో చిక్కి తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవైపు అకాల వర్షాలు కురుస్తుండటం, జూన్ నెలలో తదుపరి పంటల సాగుకు రైతాంగం సిద్ధం కావాల్సిన సమయం ఆసన్నమవడంతో అన్నదాతల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. క్షేత్రస్థాయిలో వరి కొనుగోలు కేంద్రాలతో పాటు మక్కల కొనుగోలు కేంద్రాల్లోనూ ధాన్యం నిల్వలు ఎక్కడికక్కడే పేరుకుపోయి దర్శనమిస్తున్నాయి. కాంగ్రెస్ పాలనలో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యాన్ని తరలించడానికి లారీల కొరత వేధిస్తోందని విమర్శించారు. ప్రతి గింజనూ కొనుగోలు చేస్తామంటూ ఇచ్చిన హామీలు నీటి మూటలుగానే మిగిలిపోయాయని మండిపడ్డారు. రాష్ట్రంలో వరి ధాన్యంతో పాటు ఇతర పంటల కొనుగోళ్లు కూడా అస్తవ్యస్తంగా తయారయ్యాయని ఏలేటి మహేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. జొన్నల కొనుగోలు ప్రక్రియను ప్రభుత్వం ఇంతవరకు ప్రారంభించనే లేదని గుర్తు చేశారు. ఎన్నికల సమయంలో రైతాంగానికి ఇచ్చిన ప్రతి ఒక్క హామీని తక్షణమే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. పంటలకు సరైన గిట్టుబాటు ధర కల్పించడంలో ప్రభుత్వం వెనకడుగు వేస్తోందని ఆరోపించారు. ఎకరాకు 7,500 రూపాయల చొప్పున రైతు భరోసా అందిస్తామని ఒప్పుకున్న కాంగ్రెస్ పార్టీ, అధికారంలోకి వచ్చాక ఆ పథకాన్ని ఎగ్గొట్టే ప్రయత్నం చేస్తోందని ధ్వజమెత్తారు. కొనుగోలు కేంద్రాలలో తూకం వేసే సమయంలో ప్రతి సంచికి 4 కిలోల ధాన్యాన్ని తరుగు పేరిట దోచుకుంటున్నారని, ఇది పచ్చి నిజం కాదా అని ప్రశ్నించారు. మార్కెట్లలో మక్కలను పూర్తిగా కొనుగోలు చేయలేని దయనీయ పరిస్థితిలో ప్రస్తుత ప్రభుత్వం ఉందని బీజేపీ ఎమ్మెల్యే దుయ్యబట్టారు. కొనుగోలు కేంద్రాలకు వస్తున్న రైతులు గన్నీ బ్యాగుల కొరతతో తీవ్ర తిప్పలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గురువారం మీడియా ముందుకు వచ్చి పచ్చి అబద్ధాలు మాట్లాడారని ఆరోపించారు. రాష్ట్రంలో 80 శాతం వరి కొనుగోళ్లు పూర్తయ్యాయని చెప్పుకోవడం ఆయన అజ్ఞానానికి నిదర్శనమని పేర్కొన్నారు. ఆ 80 శాతం ధాన్యాన్ని ఏ ఏ కేంద్రాల్లో కొనుగోలు చేశారో స్పష్టంగా నిరూపించాలని డిమాండ్ చేశారు. వాస్తవాలు తెలుసుకోవడానికి సీఎం తమతో వస్తే క్షేత్రస్థాయి పరిశీలనకు తీసుకెళ్తామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో వరి దిగుబడి అంచనాలకు, ప్రభుత్వం జరిపిన కొనుగోళ్లకు పొంతన లేదని ఏలేటి మహేశ్వర్‌రెడ్డి గణాంకాలతో వివరించారు. ఈ సీజన్‌లో 1,41,000 మెట్రిక్ టన్నుల వడ్ల దిగుబడి వస్తుందని అంచనా వేశారని తెలిపారు. గత ఏడాది ప్రభుత్వం సుమారు 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసిందని గుర్తు చేశారు. ఈసారి కూడా అదే స్థాయి లక్ష్యాన్ని పెట్టుకున్నామని చెబుతున్న పాలకులు, ఇప్పటివరకు కొనుగోలు చేసిన వాస్తవ పరిమాణాన్ని బయటపెట్టాలని డిమాండ్ చేశారు. క్షేత్రస్థాయిలో కేవలం 24 శాతమే కొనుగోళ్లు జరిగితే, ఏ రకమైన లెక్కలతో 80 శాతం పూర్తయిందని సీఎం ప్రకటిస్తున్నారో సమాధానం చెప్పాలన్నారు. మాటల గారడీతో ప్రజలను మోసం చేయడం కాంగ్రెస్ ప్రభుత్వానికి అలవాటుగా మారిందని విమర్శించారు. ప్రభుత్వ అసమర్థత వల్ల రైతాంగం పడుతున్న ఇబ్బందులను ప్రత్యక్షంగా పరిశీలించడానికి బీజేపీ కార్యాచరణ సిద్ధం చేసిందని ఏలేటి మహేశ్వర్‌రెడ్డి వెల్లడించారు. సోమవారం నుంచి బీజేపీ తరఫున ఉన్న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, రాష్ట్ర ముఖ్య నాయకులంతా కలిసి కొనుగోలు కేంద్రాలను సందర్శిస్తారని ప్రకటించారు. ఈ పర్యటనలకు సంబంధించిన పూర్తి వివరాలను శనివారం అధికారికంగా విడుదల చేస్తామని తెలిపారు. పర్యటన మొదటి రోజున బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు తమతో పాటు పాల్గొంటారని వివరించారు. ప్రజాప్రతినిధుల బృందాలన్నీ గ్రామాల్లోని ఐకేపీ కేంద్రాలకు వెళ్లి రైతుల సమస్యలను స్వయంగా తెలుసుకుంటాయని చెప్పారు. కొనుగోలు కేంద్రాల్లో నెలకొన్న ప్రతి సమస్యపై ప్రభుత్వాన్ని నిలదీస్తామని ఏలేటి మహేశ్వర్‌రెడ్డి హెచ్చరించారు. జొన్నలు ఎందుకు కొనడం లేదు, మక్కలు ఎన్ని మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశారు అనే విషయాలను నిరూపించడానికి తాము సిద్ధంగా ఉన్నామని సవాల్ విసిరారు. తామంతా నేరుగా ప్రజల వద్దకే వెళ్లి రైతన్నల కష్టాలను తెలుసుకుంటామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో నష్టపోతున్న రైతులకు బీజేపీ పూర్తి భరోసా కల్పిస్తుందని, వారి హక్కుల సాధన కోసం అండగా నిలబడుతుందని స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటలను నమ్మి ఓట్లేసిన అన్ని వర్గాల ప్రజలను ఈ ప్రభుత్వం దగా చేసిందని ఆరోపించారు. రైతాంగాన్ని ఆదుకోవాల్సిన కనీస బాధ్యతను విస్మరించి కాంగ్రెస్ ప్రభుత్వం గాలికి వదిలేసిందని ఏలేటి మహేశ్వర్‌రెడ్డి మండిపడ్డారు. వ్యవసాయానికి అవసరమైన యూరియా బస్తాల పంపిణీ నుంచి మొదలుకొని, పండించిన ధాన్యం అమ్ముకొనే వరకు ప్రతి చోటా రైతులకు వంచనే ఎదురవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాలలో బస్తాకు నాలుగు కిలోల చొప్పున అక్రమంగా దోచుకుంటున్న సొమ్ము ఎవరి జేబుల్లోకి పోతుందో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాలని గట్టిగా డిమాండ్ చేశారు. ఈ దోపిడీ వెనుక ఉన్న శక్తులెవరో, ఆ నిధులు ఎక్కడికి మళ్లుతున్నాయో ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో 90 లక్షల మెట్రిక్ టన్నుల వడ్ల కొనుగోలు ప్రక్రియ సాగితే, అందులో 10 శాతం మేర అంటే దాదాపు 9 లక్షల మెట్రిక్ టన్నుల వడ్ల సొమ్ము ఎవరి ఖాతాల్లోకి చేరుతోందో స్పష్టం చేయాలని ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ప్రశ్నించారు.





# ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రి తోడు దొంగలు

**మొదటిపేజీ తరువాయి**

క్రమంలో సరికొత్త పొలిటికల్ వేడి రగులుకుంది. రాష్ట్రంలో కళ్లెదుటే జరుగుతున్న దారుణాలపై ప్రభుత్వాలు అనుసరిస్తున్న తీరును కడిగిపారేస్తూ సాగిన ఈ ప్రసంగం ఇప్పుడు సామాజిక మాధ్యమాలలో సెన్సేషనల్ వైబ్‌ను క్రియేట్ చేస్తోంది. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి బండి సంజయ్ ఇద్దరూ తోడు దొంగల్లా మారి రాష్ట్రంలో చిల్లర రాజకీయం చేస్తున్నారంటూ బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రమైన ధ్వజమెత్తారు. ఒక మైనర్ బాలికపై జరిగిన దారుణ అఘాయిత్యానికి సంబంధించిన నిందితుడిని ఏకంగా 9 రోజుల పాటు కాపాడిన ఘోరమైన ఉదంతంపై ఆయన నిప్పులు చెరిగారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన లేటెస్ట్ మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ, హైకోర్టు బెయిల్ నిరాకరించడంతోనే దిక్కులేక నిందితుడిని పోలీసులకు అప్పగించారని వివరించారు. రాష్ట్రంలో కాంగ్రెస్, కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉంటూ ప్రజాస్వామ్య సూత్రాలను కాలరాస్తున్నాయని మండిపడ్డారు. ఈ మొత్తం వ్యవహారంలో తెలుగు మీడియా సైతం కళ్లు, చెవులు, ముక్కు మూసుకుని బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిందని కేటీఆర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. దాదాపుగా 4 రోజుల పాటు అసలు ఒక చిన్న స్క్రోలింగ్ కూడా వేయకుండా ఈ దారుణాన్ని తొక్కిపెట్టే ప్రయత్నం చేశారని ఆగ్రహం వెళ్లగక్కారు. జాతీయ మీడియాలో ఈ దారుణమైన వార్త ప్రసారమయ్యే దాకా స్థానిక ఛానళ్లకు కనీస సోయి లేకపోవడం సిగ్గుచేటని దుయ్యబట్టారు. ఒక మైనర్ బాలికకు, ఆమె తల్లిదండ్రులకు న్యాయం చేయాల్సింది పోయి, రక్షణ కల్పించాల్సిన పోలీస్ స్టేషన్లలోనే వారిని 6 గంటల పాటు కూర్చోబెట్టి వేధించడం పాలకుల క్రూరత్వానికి అద్దం పడుతోందని ధ్వజమెత్తారు. బాధిత కుటుంబంపైనే ఎదురు కేసులు పెట్టించిన వెధవ ఎవరో ప్రజలందరికీ బాగా తెలుసంటూ కేటీఆర్ సూటిగా ప్రశ్నించారు. ప్రధానమంత్రి బందోబస్తు విధుల వల్లనే కేసు నమోదు చేయడంలో ఆలస్యమైందన్న డీజీపీ వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా తప్పుపట్టారు. పీఎం బందోబస్తు ఉన్నప్పుడల్లా ఈ రాష్ట్రంలో నేరగాళ్లకు ఆఫీషియల్ హాలీడే ఇస్తారా అంటూ ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన చంచల్‌గూడ జైలు బ్యాచ్‌మేట్స్‌ను రాష్ట్రంలో చెలరేగిపోమని గ్రీన్ సిగ్నల్ ఇచ్చారా అని నిలదీశారు. బాధితురాలికి న్యాయం చేయకుండా, 9 రోజుల



పాటు నిందితుడికి రాచమర్యాదలు చేసి దాచిపెట్టిన తీరుపై తెలంగాణ సమాజం ఉమ్మి వేస్తోందని ఆగ్రహించారు. సమాజంలో మహిళల భద్రతకు సంబంధించిన ఇంతటి సెన్సిటివ్ విషయంలో తాము దాదాపు 10 రోజులుగా మౌనంగా ఉన్నామని కేటీఆర్ గుర్తుచేశారు. కానీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతున్న బాధ్యతారాహిత్యమైన మాటల వల్లే తాము ఇవాళ నోరు విప్పాల్సి వచ్చిందని స్పష్టం చేశారు. వడదెబ్బ తగిలి ముఖ్యమంత్రికి ఏమైనా చిన్న మెదడు చిట్లిపోయిందా అంటూ తీవ్రమైన పదజాలంతో విమర్శించారు. తన బామ్మర్ది ఇంట్లో ఏదో దొరికిందంటూ సీఎం చేస్తున్న ప్రచారం ఒక అట్టర్ ఫ్లాప్ డ్రామా అని తేల్చేశారు. అక్కడ ఏమీ దొరకలేదని ఎక్సైజ్ సూపరింటెండెంట్ స్వయంగా స్పష్టం చేసినప్పటికీ, ఇరికించాలనే కుట్రలు చేయడం సీఎం స్థాయికి తగదని హెచ్చరించారు. దేశ చరిత్రలో ఎక్కడైనా ఒక పోక్సో నిందితుడిని 9 రోజుల పాటు అరెస్ట్ చేయకుండా స్వేచ్ఛగా వదిలేసిన దాఖలాలు ఉన్నాయా అని కేటీఆర్ ప్రశ్నించారు. కాంగ్రెస్, బీజేపీ నేతల మధ్య ఉన్న అండర్ స్టాండింగ్ వల్లే ఇదంతా సాధ్యమైందని ఆరోపించారు. నిందితుడిని నిందితుడిగా చూడకుండా కాపాడటానికి కారణం వారి మధ్య ఉన్న 'ఆర్‌ఎస్ బ్రదర్స్' మేనేజ్‌మెంట్ కాదా అని నిలదీశారు. మీడియా సంస్థలకు ఫోన్లు చేసి ఈ వార్తలను రాయవద్దంటూ బతిమిలాడిన వ్యవహారాన్ని బయటపెట్టారు. ఒక సామాన్యుడు తప్పు చేస్తే చుట్టుపక్కల వారిని లాక్కొచ్చే పోలీసులు, కేంద్ర మంత్రి కొడుకు అనగానే ప్రత్యేక మర్యాదలు చేయడం దారుణమన్నారు. హైకోర్టు బెయిల్ దరఖాస్తును తిరస్కరించడం వల్లే నిందితుడు లొంగిపోవాల్సి వచ్చిందని, దీనిని పోలీసులు తామే అరెస్ట్ చేసినట్లు డ్రామాలు ఆడుతున్నారని కేటీఆర్ మండిపడ్డారు. ఇద్దరు తోడు దొంగలు కలిసి ఆడుతున్న ఈ హైడ్రామాను ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. బుర్ర తక్కువ పాలకుల వల్ల రాష్ట్రంలోని మహిళలకు కనీస రక్షణ కరువైందని ఆందోళన వ్యక్తం చేశారు. బాధిత మైనర్ బాలికకు సంబంధించిన వ్యక్తిగత వివరాలను సోషల్ మీడియాలో లీక్ చేసిన పేట్ బషీరాబాద్ బీజేపీ నాయకులను ఎందుకు అరెస్ట్ చేయలేదని ప్రశ్నించారు. ఈ దారుణాన్ని హనీట్రాప్ అంటూ ప్రచారం చేసిన కొన్ని మీడియా సంస్థలు పైసల ట్రాప్‌లో పడిపోయాయని ఎద్దేవా చేశారు. పోక్సో చట్టం కింద బుక్ అయిన ఏ క్రిమినల్‌కైనా 25 ఏళ్ల జైలు శిక్ష పడే అవకాశం ఉంటుందని, అలాంటి నిందితుడికి ముఖ్యమంత్రి హోదాలో ఉండి రేవంత్ రెడ్డి స్పెసిఫిక్ ట్రీట్‌మెంట్ ఇవ్వడం సిగ్గుచేటన్నారు. ప్రధాని మోదీ ఏమైనా రేవంత్ రెడ్డి చెవిలో చెప్పి నిందితుడిని కాపాడమన్నారా అని నిలదీశారు. కరీంనగర్‌లో తుపాకులతో కాల్పులు జరిపిన క్రిమినల్స్ దొరకడానికి 15 రోజులు పడుతోందంటే రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ ఏ స్థాయిలో పడిపోయిందో అర్థం చేసుకోవచ్చన్నారు. పలుకుబడి ఉన్న నేరస్థులను పట్టుకోకుండా ఇలాగే ప్రవర్తిస్తే భవిష్యత్తులో ఏ ఆడపిల్ల కూడా పోలీసులకు ఫిర్యాదు చేయడానికి ముందుకు రాదని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ అన్యాయంపై మొదటి నుంచి అద్భుతంగా పోరాటం చేసిన తమ పార్టీ నాయకుడు ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్‌కు కేటీఆర్ హృదయపూర్వక అభినందనలు తెలిపారు. బాధితురాలికి న్యాయం జరిగేలా మీడియాను, సమాజాన్ని అలార్ట్ చేస్తూ ఆయన నిరంతరం క్షేత్రస్థాయిలో నిలిచారని కొనియాడారు. రేవంత్ రెడ్డి తాజాగా పోలీస్ అధికారులతో సమావేశం నిర్వహించి దొంగలను ఎలా పట్టుకోవాలో క్లాసులు చెప్పడం పెద్ద జోక్ అని కొట్టిపారేశారు. ఓటుకు నోటు కేసులో రేవంత్ రెడ్డిని పట్టుకున్నది కూడా అదే పోలీసులని, దొరికిన దొంగే ఇవాళ పోలీసులకు పాఠాలు చెబుతుంటే అక్కడున్న వారంతా లోపల నవ్వుకుని ఉంటారని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. తాను ముఖ్యమంత్రిని అనే కనీస హుందాతనాన్ని రేవంత్ రెడ్డి మర్చిపోయి నిరంతరం ప్రతిపక్షంలో ఉన్నట్లు ప్రవర్తిస్తున్నారని కేటీఆర్ విమర్శించారు. ఒక చిన్న స్కూల్ పిల్లోడిలా ప్రవర్తించడం మానేసి, ధాన్యం కొనుగోళ్లపై దృష్టి పెట్టాలని సూచించారు. డ్రగ్స్ పరీక్షలకు తాము ఎప్పుడూ సిద్ధమేనని, రేవంత్ రెడ్డి తన ఎంపీలకు ఆ పరీక్షలు పెట్టించాలని సవాల్ విసిరారు. గతంలో డ్రగ్స్ కేసు ఆరోపణలు ఎదుర్కొన్న రోహిత్ రెడ్డిని తాము ఎప్పుడో పార్టీ నుంచి సస్పెండ్ చేశామని, షోకాజ్ నోటీసులు కూడా ఇచ్చామని స్పష్టం చేశారు. సీఎంకు ఈ కనీస విషయాలు కూడా తెలియకపోవడం ఆయన అజ్ఞానానికి నిదర్శనమని కేటీఆర్ ఎద్దేవా చేశారు.

# ఫ్యూచర్ సిటీ రద్దు చేస్తాం

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

రాష్ట్రంలో గత ప్రభుత్వ హయాంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా అంకురార్పణ జరిగిన ఫార్మా సిటీ భవితవ్యంపై ప్రస్తుత కాంగ్రెస్ సర్కార్ తీసుకుంటున్న నిర్ణయాలు ప్రధాన ప్రతిపక్షమైన భారత్ రాష్ట్ర సమితి శ్రేణుల్లో తీవ్ర ఆగ్రహాన్ని కలిగిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే లండన్, అమెరికా పర్యటనల్లో బిజీగా గడుపుతున్న మాజీ మంత్రి, సిద్దిపేట శాసనసభ్యుడు తన్నీరు హరీశ్‌రావు సుదూర తీరాల నుంచి విసిరిన రాజకీయ అస్త్రం రాష్ట్ర పాలనా వర్గాల్లో పెను సంచలనాన్ని సృష్టిస్తోంది. అధికార మార్పిడి జరిగిన నాటి నుంచి మౌనంగా గమనిస్తున్న గులాబీ దళం, ఈ మెగా ప్రాజెక్టుల విషయంలో ఇకపై దూకుడుగా ముందడుగు వేయాలనే స్పష్టమైన సంకేతాలను పంపించింది. భూసేకరణ ప్రక్రియ పూర్తి చేసుకుని, మౌలిక వసతుల కల్పన దశకు చేరిన ఒక బృహత్తర పారిశ్రామిక క్లస్టర్‌ను కేవలం రాజకీయ కారణాలతో పక్కన పెట్టడంపై ప్రతిపక్షం గట్టిగానే నిలదీస్తోంది. రాజధాని హైదరాబాద్ నగర శివార్లలో అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించతలపెట్టిన ఫార్మా సిటీ ప్రాజెక్టుకు కేంద్ర పర్యావరణ శాఖ సైతం అన్ని రకాల చట్టబద్ధమైన అనుమతులు మంజూరు చేసింది. ఇంతటి కీలకమైన దశకు చేరుకున్న ప్రాజెక్టు స్వరూపాన్ని మార్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం డ్రామాలు ఆడుతోందని హరీశ్‌రావు తీవ్రంగా మండిపడ్డారు. పారిశ్రామిక అభివృద్ధిని విస్మరించి, భూములను ఇతర ప్రయోజనాలకు మళ్లించే ప్రయత్నాలు చట్టసభల నిబంధనలకు పూర్తిగా విరుద్ధమని ఆయన స్పష్టం చేశారు. ఒక నిర్దిష్ట ప్రయోజనం కోసం సేకరించిన రైతుల భూములను వేరే వ్యాపారాలకు వాడటం చట్టరీత్యా సాధ్యం కాదని గుర్తుచేశారు. భూసేకరణ చట్టాల ప్రకారం ఏ రైతుల నుంచి అయితే భూములను సేకరించారో, అదే అవసరం కోసం వాటిని వినియోగించాల్సి ఉంటుంది. ఒకవేళ సేకరించిన భూమిని నిర్దేశిత ప్రాజెక్టుకు కాకుండా ఇతర అవసరాలకు మళ్లిస్తే, ఆ భూములను తిరిగి అసలు యజమానులైన రైతులకే అప్పగించాలనే కేంద్ర పార్లమెంట్ చట్టం అమల్లో ఉందని మాజీ మంత్రి గుర్తుచేశారు. ఈ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న ద్వంద్వ వైఖరిని ఆయన ఎండగట్టారు. ఒకవైపు పబ్లిక్ వేదికలపై ఫార్మా సిటీని రద్దు చేసి ఫ్యూచర్ సిటీని నిర్మిస్తామని ప్రగల్భాలు పలుకుతున్న పాలకులు, న్యాయస్థానాల పరిధిలోకి వచ్చేసరికి మాట మారుస్తున్నారని ఆరోపించారు. హైకోర్టులో ఇటీవల విచారణకు వచ్చిన ఒక కేసు సందర్భంగా రేవంత్ సర్కార్ దాఖలు చేసిన అఫిడవిట్ ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. తాము ఫార్మా సిటీని యథావిధిగా కొనసాగిస్తున్నామని కోర్టుకు లిఖితపూర్వకంగా చెప్పిన విషయాన్ని ఆయన బయటపెట్టారు. కోర్టుల ముందు ఒకలా, ప్రజల ముందు మరోలా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ పాలకులు కేవలం పొలిటికల్ జిమ్మిక్కులతో కాలక్షేపం చేస్తున్నారని హరీశ్‌రావు



ధ్వజమెత్తారు. వాస్తవానికి ఫార్మా రంగానికి అనుబంధంగా అవసరమైన కనీస సౌకర్యాలు, విద్యా సంస్థలు, గృహ నిర్మాణ సముదాయాల కోసం ఒక ప్రత్యేక నిష్పత్తిని గతంలోనే ఖరారు చేశారు. ఒక పారిశ్రామిక ప్రాంతంలో 75 శాతం మేర ప్రధాన పరిశ్రమలు ఉండాలి, మిగిలిన 25 శాతం స్థలాన్ని దానికి సంబంధించిన మౌలిక వసతుల కోసం వినియోగించాలి. కానీ ప్రస్తుత ప్రభుత్వం ఈ నిష్పత్తిని పూర్తిగా తలకిందులు చేస్తూ ఒక విచిత్రమైన ప్రణాళికను సిద్ధం చేస్తోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కేవలం 25 శాతం భూమిలోనే ఫార్మా పరిశ్రమలను అనుమతించి, మిగిలిన 75 శాతం స్థలాన్ని వ్యాపార సముదాయాలకు కట్టబెట్టేలా చేస్తున్న కుట్రలను ఆయన తీవ్రంగా తప్పుపట్టారు. నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న ఈ భూముల కేటాయింపు ప్రక్రియ చట్ట ప్రకారం ఏమాత్రం చెల్లదని మాజీ మంత్రి హెచ్చరించారు. ఫ్యూచర్ సిటీ అనే ఒక ఆకర్షణీయమైన పేరును తెరపైకి తెచ్చి, దాని వెనుక భారీ రియల్ ఎస్టేట్ వ్యాపారానికి తెరలేపారని తీవ్ర విమర్శలు గుప్పించారు. ప్రభుత్వ పెద్దలకు లాభం చేకూర్చేలా సాగుతున్న ఈ రియల్ దందాపై తాము నిశ్శబ్దంగా ఉండబోమని స్పష్టం చేశారు. భవిష్యత్తులో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టును 100 శాతం రద్దు చేస్తామని సంచలన ప్రకటన చేశారు. కాంగ్రెస్ సర్కార్ ఆశలపైన, రియల్ వ్యాపారుల అంచనాలపైన హరీశ్‌రావు చేసిన ఈ ప్రకటన ఒక్కసారిగా తెలంగాణ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టించింది. తాము రాగానే ఫార్మా సిటీని పాత పద్ధతిలోనే పునరుద్ధరిస్తామని గట్టిగా నొక్కిచెప్పారు. ఈ నిర్ణయం కేవలం ఒక రాజకీయ పార్టీ లబ్ధి కోసం తీసుకుంటున్నది కాదని, పార్లమెంట్ చట్టాల పరిరక్షణ కోసమేనని ఆయన వివరించారు. నాటి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు ఎంతో దూరదృష్టితో ఈ పారిశ్రామిక క్లస్టర్‌ను డిజైన్ చేశారని గుర్తుచేశారు. ప్రపంచంలోనే అత్యుత్తమ ఫార్మా హబ్‌గా తెలంగాణను తీర్చిదిద్దడం ద్వారా లక్షలాది మంది స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించవచ్చని భావించామన్నారు. హైదరాబాద్ నుంచి ఒక్కటంటే ఒక్క ఫార్మా కంపెనీ కూడా పక్క రాష్ట్రాలకు లేదా విదేశాలకు తరలిపోకూడదనే పట్టుదలతో నాటి ప్రభుత్వం మౌలిక వసతులను కల్పించిందని వివరించారు. ఇంతటి ఉపాధి కల్పన సామర్థ్యం ఉన్న రంగాన్ని దెబ్బతీసి, రియల్ ఎస్టేట్ వెంచర్లు వేయడం రాష్ట్ర ప్రయోజనాలకు గొడ్డలిపెట్టులా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఇప్పటికే రెండున్నరేళ్ల సుదీర్ఘ కాలం గడిచిపోయిందని హరీశ్‌రావు గుర్తుచేశారు. ఐదేళ్ల కాల పరిమితిలో సగం సమయం వృధా అయిపోయిందని, మిగిలిన కాలంలో చివరి ఒక ఏడాది కాలం ఎలాగూ ఎన్నికల కోలాహలంలోనే గడిచిపోతుందని విశ్లేషించారు. ఈ లెక్కన చూసుకుంటే రేవంత్ రెడ్డి నేతృత్వంలోని సర్కార్ గడిచిన కాలంలో రాష్ట్ర ప్రగతికి చేసిందేమీ లేదని విమర్శించారు. కేవలం కాలయాపన చేస్తూ, గత ప్రభుత్వ ప్రాజెక్టులపై బురదజల్లడమే పనిగా పెట్టుకున్నారని మండిపడ్డారు. ఫార్మా సిటీ కోసం సేకరించిన విలువైన భూములను ముక్కలు ముక్కలుగా పంచిపెట్టడం వెనుక ఇన్వెస్టర్ల నుంచి క్విడ్ ప్రో కో పద్ధతిలో లబ్ధి పొందాలనే రహస్య అజెండా దాగి ఉందనే అనుమానాలను ఆయన వ్యక్తంచేశారు. గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన ఈ పారిశ్రామిక ప్రాజెక్టు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే బీఆర్‌ఎస్ పార్టీకి ఎక్కడ మంచి పేరు వస్తుందోననే భయం కాంగ్రెస్ పాలకులను వెంటాడుతోందని ఎద్దేవా చేశారు. ఆ క్రెడిట్ తమకు దక్కకుండా చేసేందుకే ప్రాజెక్టు పేరు మార్పులు, మ్యాపుల మార్పులంటూ కొత్త నాటకాలను రక్తికట్టిస్తున్నారని ఆరోపించారు. అయితే అధికార పక్షం ఎన్ని జిమ్మిక్కులు చేసినా, ఎలాంటి ప్రణాళికలు రచించినా అవి చట్టాల ముందు నిలబడబోవని, క్షేత్రస్థాయిలో సాగబోవని జ్యోస్యం చెప్పారు. న్యాయపరమైన రక్షణలు, పార్లమెంటరీ చట్టాల పరిధి ప్రకారం ఉన్నది ఉన్నట్టుగా అక్కడ ఫార్మా సిటీ మాత్రమే ఏర్పాటవుతుందని, ఇండస్ట్రీస్ రావడం ఖాయమని హరీశ్‌రావు క్లారిటీ ఇచ్చారు. అమెరికాలో ప్రవాస భారతీయులు ఏర్పాటు చేసిన ఒక ప్రత్యేక సమావేశంలో పాల్గొన్న సందర్భంగా ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో సైతం తెగ వైరల్ అవుతున్నాయి. తెలంగాణ పారిశ్రామిక విధానాలు, మౌలిక వసతుల కల్పనలో స్థిరత్వం లేకపోతే అంతర్జాతీయ పెట్టుబడిదారులు వెనకడుగు వేసే ప్రమాదం ఉందని ఆర్థిక నిపుణులు సైతం హెచ్చరిస్తున్నారు. ఒక ప్రభుత్వం ప్రారంభించిన మెగా ప్రాజెక్టును తదుపరి ప్రభుత్వం పూర్తిగా మార్చేయాలని చూడటం, దానికి ప్రతిగా తాము అధికారంలోకి రాగానే మళ్లీ రద్దు చేస్తామని ప్రతిపక్షం ప్రకటించడం ఇన్వెస్టర్లలో ఒక రకమైన అనిశ్చితిని సృష్టిస్తోంది. ఈ పొలిటికల్ వార్ రాబోయే రోజుల్లో ఎలాంటి మలుపులు తిరుగుతుందో చూడాలి.

# టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉత్తమ్ పద్మావతి?

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ కాంగ్రెస్ సామ్రాజ్యంలో అధికార పీఠాన్ని అధిరోహించిన నాటి నుండి నేటివరకు పాలనా వ్యవహారాలపై చూపిన శ్రద్ధ సంస్థాగత నెట్‌వర్క్‌పై చూపలేదనే విమర్శలు గుప్పుమంటున్నాయి. గాంధీభవన్ వారసత్వాన్ని మోస్తున్న టీపీసీసీ బాధ్యతలను మహేష్ కుమార్ గౌడ్ స్వీకరించి సుమారు 18 నెలలు గడుస్తున్నా.. నేటికీ జాతీయ నాయకత్వం ఆశించిన స్థాయిలో జంబో కమిటీల కసరత్తు పూర్తికాలేదు. ఈ క్రమంలోనే రాబోయే స్థానిక సంస్థల సమరానికి పార్టీ క్యాడర్‌ను పూర్తిస్థాయిలో సమాయత్తం చేయడమే లక్ష్యంగా అధిష్ఠానం సరికొత్త సమాలోచనలు చేస్తోంది. దశాబ్దాల రాజకీయ స్తబ్దతకు తెరదించుతూ సమూల మార్పులతో కూడిన సరికొత్త సంస్థాగత ముఖచిత్రాన్ని ఆవిష్కరించేందుకు హస్తం పెద్దలు ఢిల్లీ వేదికగా వ్యూహాత్మక అడుగులు వేస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ సారథి మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ త్రయం నిరంతరాయంగా సరికొత్త నియామకాలపై తుది జాబితాను సిద్ధం చేసే పనిలో నిమగ్నమయ్యారు. ప్రభుత్వ కార్యక్రమాల ప్రచారంతో పాటు క్షేత్రస్థాయిలో ప్రతిపక్షాల విమర్శలను సమర్థవంతంగా తిప్పికొట్టేలా సరికొత్త రాష్ట్ర కమిటీ రూపురేఖలను డిజైన్ చేస్తున్నారు. కేవలం అధికార ప్రతినిధులు, ప్రధాన కార్యదర్శుల భర్తీతో సరిపెట్టకుండా క్షేత్రస్థాయి శ్రేణుల్లో నూతనోత్తేజాన్ని నింపేలా కీలక నిర్ణయాలు తీసుకోనున్నారు. ఈ మేరకు సుదీర్ఘ కాలంగా వాయిదా పడుతూ వస్తున్న నియామకాల ప్రతిష్టంభనకు రాబోయే 72 గంటల్లో పూర్తిస్థాయిలో తెరపడనుందని విశ్వసనీయ సమాచారం. ఈ తాజా సంస్థాగత పునర్వ్యవస్థీకరణలో అందరి దృష్టిని ఆకర్షిస్తున్న ప్రధానమైన పేరు కోదాడ నియోజకవర్గ శాసనసభ్యురాలు పద్మావతి ఉత్తమ్ కావడమే విశేషం. ఆమె గతంలోనే కేబినెట్ హోదాతో కూడిన ప్రతిష్టాత్మక కార్పొరేషన్ చైర్మన్ పదవిని ఆశించినట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జోరుగా సాగింది. అయితే, ఆమె భర్త ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రస్తుతం రాష్ట్ర మంత్రివర్గంలో అత్యంత కీలకమైన నీటిపారుదల, పౌరసరఫరాల శాఖల మంత్రిగా అగ్రశ్రేణిలో కొనసాగుతున్నారు. ఈ నేపథ్యంలో ఒకే కుటుంబానికి రెండు కేబినెట్ ర్యాంక్ ప్రభుత్వ పదవులు కేటాయిస్తే సొంత పార్టీలోనే తీవ్ర అసంతృప్తి వ్యక్తమయ్యే ప్రమాదం ఉందని జాతీయ నాయకత్వం భావిస్తోంది. ఒకే నియోజకవర్గం లేదా ఒకే ఇంటికి పవర్‌ఫుల్ ప్రభుత్వ పదవులు ఇస్తే ప్రజల్లోనూ ప్రతికూల చర్చకు దారితీస్తుందని రాజకీయ విశ్లేషకులు సైతం అభిప్రాయపడుతున్నారు. ఈ సమీకరణాలను క్షుణ్ణంగా పరిశీలించిన కాంగ్రెస్ హైకమాండ్ పద్మావతి రెడ్డికి ప్రభుత్వపరమైన నామినేటెడ్ పదవి కాకుండా పార్టీలో అత్యంత గౌరవప్రదమైన వర్కింగ్ ప్రెసిడెంట్ బాధ్యతలను అప్పగించాలని నిశ్చయించింది. దీని వల్ల ప్రభుత్వంలో ఒకే కుటుంబానికి రెండు అధికార



కేంద్రాలు ఉన్నాయనే విమర్శలను సమర్థవంతంగా అడ్డుకోవచ్చని పెద్దలు భావిస్తున్నారు. ఈ నిర్ణయం ద్వారా అటు ఉత్తమ్ కుమార్ రెడ్డి వర్గానికి సముచిత గౌరవం ఇచ్చినట్లవుతుందని, ఇటు పార్టీ ఐక్యతను కాపాడినట్లవుతుందని భావిస్తున్నారు. పద్మావతి రెడ్డికి టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ పదవిని ఖరారు చేయడం వెనుక అధిష్ఠానం అనేక సామాజిక, రాజకీయ లెక్కలను సిద్ధం చేసింది. రాబోయే ఎన్నికల్లో మహిళా ఓటు బ్యాంకే అత్యంత కీలకం కానున్న నేపథ్యంలో పార్టీ కమిటీల్లో మహిళలకు 33 శాతం ప్రాధాన్యత కల్పించాలనే రాహుల్ గాంధీ సంకల్పానికి ఈ నిర్ణయం బలాన్ని ఇస్తుంది. రెడ్డి సామాజికవర్గానికి చెందిన సీనియర్ మహిళా పారిశ్రామికవేత్త, విద్యావంతురాలైన నాయకురాలిగా పద్మావతిని ముందుంచడం ద్వారా సామాజిక సమీకరణాలను బ్యాలెన్స్ చేయవచ్చు. ఒక్క నియామకంతో అటు మహిళా కోటా, ఇటు రెడ్డి సామాజికవర్గ ప్రాతినిధ్యం అనే రెండు లక్ష్యాలను హస్తం పెద్దలు నెరవేర్చనున్నారు. టీపీసీసీ నిబంధనల ప్రకారం మొత్తం నలుగురు వర్కింగ్ ప్రెసిడెంట్లను నియమించుకునే అద్భుతమైన అవకాశం రాష్ట్ర కమిటీకి ఉంది. ఒక స్థానాన్ని మహిళా కోటాలో పద్మావతి రెడ్డితో భర్తీ చేయాలని దాదాపు ఖరారు చేయగా మిగిలిన మూడు ఖాళీలపై గాంధీభవన్‌లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఈ పదవుల రేసులో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పలువురు సీనియర్ నేతలు, మాజీ ఎంపీలు, బలమైన ఆశావహులు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. పార్టీ కోసం మొదటి నుండి కష్టపడిన నిఖార్సైన కాంగ్రెస్ సైనికులకే ఈ పీఠాలు దక్కేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా స్క్రూటినీ చేస్తుండటం విశేషం. రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ ఈ మిగిలిన మూడు వర్కింగ్ ప్రెసిడెంట్ స్థానాల భర్తీలో 'సామాజిక న్యాయం' అనే సూత్రాన్ని కచ్చితంగా అమలు చేయాలని పట్టుబడుతున్నారు. జనాభా నిష్పత్తికి అనుగుణంగా పదవుల పంపకం జరగాలనే ఉద్దేశంతో ఒక స్థానాన్ని వెనుకబడిన తరగతులకు (బీసీ) కేటాయించాలని ప్రతిపాదించారు. మూడో స్థానాన్ని షెడ్యూల్డ్ కులాల (ఎస్సీ) ప్రతినిధితో, నాలుగో స్థానాన్ని షెడ్యూల్డ్ తెగల (ఎస్టీ) పవర్‌ఫుల్ లీడర్‌తో భర్తీ చేయాలనే ప్రణాళికను సిద్ధం చేశారు. ఈ ఐక్యత ఫార్ములా ద్వారా విపక్షాల సామాజిక విమర్శలకు శాశ్వతంగా బ్రేక్ వేయవచ్చని కాంగ్రెస్ వ్యూహకర్తలు భావిస్తున్నారు. రాబోయే పంచాయతీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ వంటి క్షేత్రస్థాయి స్థానిక సంస్థల ఎన్నికలను అధికార కాంగ్రెస్ పార్టీ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంటోంది. అసెంబ్లీ ఎన్నికల విజయాన్ని క్షేత్రస్థాయిలో నిలబెట్టుకోవాలంటే కేవలం ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రచారం మాత్రమే సరిపోదని హైకమాండ్ గుర్తించింది. ప్రతి గ్రామంలోనూ బలమైన సంస్థాగత నెట్‌వర్క్, కమిటీల లీడర్‌షిప్ ఉంటేనే ప్రతిపక్షాల వ్యూహాలను చిత్తు చేయడం సాధ్యమవుతుంది. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర కమిటీతో పాటు జిల్లా, బ్లాక్, మండల కమిటీలను ఒకేసారి నూతన రక్తం, సరికొత్త జోష్‌తో భర్తీ చేయాలని నిర్ణయించారు. సుదీర్ఘ కాలంగా పార్టీ అధికారంలోకి వచ్చినప్పటికీ తమకు ఎలాంటి గుర్తింపు దక్కలేదని ఆవేదనలో ఉన్న ద్వితీయ శ్రేణి నాయకులను బుజ్జగించేందుకు ఈ జంబో కమిటీల నియామకం ఒక బ్రహ్మాస్త్రంలా ఉపయోగపడనుంది. దాదాపు 150 మందికి పైగా కార్యదర్శులు, సంయుక్త కార్యదర్శుల పదవుల ద్వారా జిల్లాల్లోని అసంతృప్త నేతలకు కీలక బాధ్యతలు అప్పగించనున్నారు. పదవుల పంపకంలో అర్హత, సీనియారిటీ, నియోజకవర్గాల్లో వారికున్న పట్టును మాత్రమే ప్రామాణికంగా తీసుకుంటున్నారు. దీనివల్ల అంతర్గత విభేదాలు సమసిపోయి రాబోయే ఎన్నికల సమరానికి క్యాడర్ మొత్తం ఒకే తాటిపైకి వచ్చే అద్భుతమైన అవకాశం లభిస్తుంది. నవ తెలంగాణాలో కాంగ్రెస్ మార్క్ రాజకీయ వైభవానికి ఈ తాజా కమిటీల భర్తీ ఒక ఐకానిక్ మైలురాయిగా నిలిచిపోనుందని పొలిటికల్ సర్కిల్స్ విశ్లేషిస్తున్నాయి. దశాబ్దాలుగా ఉన్న సంప్రదాయ పద్ధతులను పక్కన పెట్టి ఆధునిక కార్పొరేట్ శైలిలో, పూర్తి డిజిటల్ డేటా ఆధారంగా ఈ నియామకాలు చేపట్టడం విశేషం. ప్రభుత్వ పనితీరును ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు సోషల్ మీడియా వేదికగా ప్రతిపక్షాల ఫేక్ ప్రచారాన్ని అడ్డుకునేందుకు ఈ నూతన కమిటీల శ్రేణులు సైనికుల్లా పనిచేయనున్నాయి.

# సర్కార్ దవాఖానలో నిలువు దోపిడీ

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

హైదరాబాద్ మహానగరంలోని ప్రముఖ ప్రభుత్వ ఆసుపత్రులు పేద ప్రజల ప్రాణాలను కాపాడే సంజీవనులుగా వెలుగొందుతున్నప్పటికీ, అక్కడ క్షేత్రస్థాయిలో అందుతున్న సేవలు మాత్రం నిరుపేద రోగులను తీవ్ర నిరాశకు గురిచేస్తున్నాయి. ఉచితంగా మెరుగైన వైద్యం లభిస్తుందనే ఆశతో సుదూర ప్రాంతాల నుంచి వచ్చే రోగులు, వారి సహాయకులను కిందిస్థాయి సిబ్బంది పట్టిపీడిస్తున్నారు. ఆసుపత్రిలో అడుగుపెట్టిన క్షణం నుంచి చికిత్స ముగించుకుని డిశ్చార్జ్ అయ్యే వరకు ప్రతి ఒక్క చిన్న పనికి లంచాలు డిమాండ్ చేస్తూ వేధింపులకు గురిచేయడం నిత్యకృత్యంగా మారింది. గాంధీ, ఉస్మానియా, నిలోఫర్, నిమ్స్ వంటి ప్రతిష్ఠాత్మక వైద్య సంస్థల్లో కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది ఈ దోపిడీకి తెరలేపడం ఆందోళన కలిగిస్తోంది. ప్రభుత్వ వైద్య రంగంలో అత్యున్నత ప్రమాణాలు కలిగిన నిమ్స్ ఆసుపత్రిలో ఇటీవల




వెలుగుచూసిన ఒక దారుణ సంఘటన సిబ్బంది బరితెగింపునకు అద్దం పడుతోంది. రేడియాలజీ విభాగంలో పనిచేస్తున్న ఒక అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి ఏకంగా కిడ్నీలను సరఫరా చేస్తానని నమ్మించి, ఓ అమాయక రోగి కుటుంబం నుంచి అక్షరాలా ఒక లక్షా యాభై వేల రూపాయల భారీ మొత్తాన్ని వసూలు చేశాడు. అవయవాల మార్పిడి కోసం ఎంతో ఆశతో ఎదురుచూస్తున్న బాధితుల బలహీనతను ఆసరాగా చేసుకుని చేసిన ఈ పెద్ద మోసంపై పైఅధికారులకు లిఖితపూర్వక ఫిర్యాదు అందింది. దాంతో ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం రంగంలోకి దిగిన పోలీసులు ఆ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగిని అరెస్ట్ చేసి జైలుకు పంపారు. నగరంలోని ఉస్మానియా, గాంధీ ఆసుపత్రుల్లోని వివిధ వార్డుల్లోకి రోగుల సహాయకులను అనుమతించాలన్నా, అత్యవసర సమయాల్లో స్ట్రెచర్‌పై రోగులను ఒక చోటు నుంచి మరో చోటుకు తరలించాలన్నా సిబ్బంది నిర్మొహమాటంగా రేట్లు చెప్తున్నారు. ఇటువంటి చిన్న చిన్న సేవలకు యాభై రూపాయల నుంచి వంద రూపాయల వరకు వసూలు చేస్తూ రోగుల ఇబ్బందులపై కాసుల వేట సాగిస్తున్నారు. ఆసుపత్రుల్లోని అత్యవసర విభాగానికి వచ్చే పేద రోగుల ప్రాణ రక్షణ కంటే సెక్యూరిటీ సిబ్బంది తమ జేబులు నింపుకోవడానికే ప్రాధాన్యత ఇస్తున్నారు. గేట్ల వద్ద కావలి ఉండే సెక్యూరిటీ సిబ్బందికి లంచం ఇస్తేనే లోపలికి అనుమతిస్తుండటంతో అత్యవసర వైద్యం కోసం వచ్చే వారు తీవ్ర మానసిక క్షోభను అనుభవిస్తున్నారు. వార్డుల్లో రోగులు పడుకునే బెడ్ మీద దుప్పటి మార్చాలన్నా కిందిస్థాయి సిబ్బందికి చేతులు తడపాల్సిందేనని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆఖరికి ఆసుపత్రి మార్చురీ వద్ద విషాదంలో ఉన్న మృతుల కుటుంబాలను సైతం వదలకుండా, మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించడానికి ఏకంగా ఐదు వేల రూపాయల వరకు లాగుతున్నారు. పుట్టెడు దుఃఖంలో ఉన్న పేద వారి నుంచి ఇటువంటి దారుణ వసూళ్లకు పాల్పడటం మానవత్వానికే మాయని మచ్చగా మారుతోంది. వైద్య సేవల నిమిత్తం కేటాయించిన ప్రభుత్వ నిధులు సక్రమంగా అందుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో అమలవుతున్న ఇటువంటి అక్రమ వసూళ్లు వైద్య రంగానికి తీవ్ర చెడ్డపేరు తెచ్చిపెడుతున్నాయి. ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రుల్లో సైతం ఈ లంచాల పర్వం పతాక స్థాయికి చేరడం గమనార్హం, అక్కడ కాన్పుల కోసం సిబ్బంది ముందే రేట్లు ఫిక్స్ చేశారు. ఆసుపత్రిలో చేరిన గర్భిణీలకు కాన్పు పూర్తయిన తర్వాత అబ్బాయి పుడితే ఐదు వేల రూపాయలు, అమ్మాయి పుడితే మూడు వేల రూపాయలు ఇవ్వాలంటూ సిబ్బంది తెగేసి చెబుతున్నారు. ఒకవేళ ఆశించిన స్థాయిలో డబ్బులు ఇవ్వకపోతే బాలింతలను, నవజాత శిశువులను సరిగా పట్టించుకోకుండా నిర్లక్ష్యం ప్రదర్శిస్తూ తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారు. కొత్తగా ప్రాణం పోసుకున్న బిడ్డను చూసి మురిసిపోవాల్సిన కుటుంబాలు, సిబ్బంది పెడుతున్న లంచాల వేధింపులు తట్టుకోలేక అప్పులు చేయాల్సిన దుస్థితి నెలకొంది. ఇటీవల ఉస్మానియా ఆసుపత్రిలో జరిగిన ఒక సంఘటన ఈ అక్రమ వసూళ్ల గుట్టును పూర్తిగా రట్టు చేస్తూ సామాజిక మాధ్యమాల్లో దర్శనమిచ్చింది. ఇన్‌పేషెంట్లను పరామర్శించేందుకు రాత్రి వేళల్లో వచ్చే రోగుల బంధువుల నుంచి ఒక మహిళా సెక్యూరిటీ గార్డు యథేచ్ఛగా డబ్బులు వసూలు చేస్తుండటాన్ని గమనించిన ఓ రోగి సహాయకుడు ఆ దృశ్యాలను తన మొబైల్‌లో రహస్యంగా చిత్రీకరించాడు. ఈ విధంగా రికార్డు చేసిన వీడియోను సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో అది కాస్తా క్షణాల్లో వైరల్‌గా మారి, నగరవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించింది. ఈ వీడియో ఆధారంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో భద్రతా సిబ్బంది సాగిస్తున్న వసూళ్ల పర్వం ఎంత యథేచ్ఛగా సాగుతోందో స్పష్టంగా అర్థమవుతోంది. ఈ తరహా అక్రమ వసూళ్లపై గతంలో అనేకసార్లు బాధితుల నుంచి ఫిర్యాదులు రావడంతో ఉన్నతాధికారులు కొంతమంది సిబ్బందిపై విచారణ జరిపి సస్పెన్షన్ వంటి కఠిన చర్యలు తీసుకున్నారు. అయినప్పటికీ క్షేత్రస్థాయిలో గ్రౌండ్ రియాలిటీ మాత్రం ఏమాత్రం మారడం లేదని, సిబ్బంది తమ పంథాను మార్చుకోవడం లేదని బాధితులు స్పష్టం చేస్తున్నారు. ఒకరిద్దరిపై చర్యలు తీసుకున్నప్పుడు కొద్దిరోజులు సైలెంట్‌గా ఉంటున్న సిబ్బంది, ఆ తర్వాత మళ్లీ పాత పద్ధతిలోనే వసూళ్లకు తెరలేపుతూ పేదలను పీడిస్తున్నారు. ఉన్నతాధికారుల తనిఖీలు కేవలం పగటి పూట మాత్రమే సాగుతుండటంతో రాత్రి సమయాల్లో ఈ దోపిడీ మరీ మితిమీరిపోతోందని రోగులు వాపోతున్నారు.

# పాకాల కొత్తగూడా సభకు గ్రామ గ్రామాన ఆదివాసి పోరుకేక

**46 డిగ్రీల ఎండలోనూ డాక్టర్ మైపతి అరుణ్ కుమార్ ప్రచార యాత్ర**




**మహబూబాబాద్ విశాల భారతి:** గంగారం మండలం కామారం గ్రామంలో ఆదివాసి ఉద్యమ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మైపతి అరుణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి ఈసం సుధాకర్లకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. పూలమాలలు, పుష్పగుచ్ఛాలతో ఆహ్వానిస్తూ డోలు వాయిద్యాల మధ్య భారీ ర్యాలీ నిర్వహించారు. "మేము సైతం చలో కొత్తగూడా" అంటూ గ్రామ ప్రజలు నినాదాలు చేశారు. 46 డిగ్రీల తీవ్ర ఎండలను కూడా లెక్కచేయకుండా చిన్నారుల నుంచి వృద్ధుల వరకు ఉద్యమానికి మద్దతుగా ముందుకు రావడం విశేషంగా నిలిచింది. చేతుల్లో కర్రలు పట్టుకుని ఆదివాసి అస్తిత్వ పరిరక్షణ కోసం పోరాటంలో పాల్గొనడానికి సిద్ధమవుతున్నామని గ్రామస్తులు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ మైపతి అరుణ్ కుమార్ మాట్లాడుతూ, "ఎస్టీ జాబితా నుంచి లంబాడాలను తొలగించే వరకు నా పోరాటం ఆగదు" అని స్పష్టం చేశారు. జూన్ 3న జరిగే పాకాల కొత్తగూడా "ఆదివాసి పోరు కేక" భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని గ్రామ గ్రామాన ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పగిడిద్దరాజు సన్నిధి నుంచి ప్రారంభమైన ద్విచక్ర వాహన ర్యాలీలో యువత భారీగా పాల్గొంది. గూడెం గూడెం తిరుగుతూ ఆదిమ తెగల అస్తిత్వ పరిరక్షణ కోసం ప్రజలను ఏకం చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. తీవ్ర ఎండల కారణంగా అనారోగ్యానికి గురైనప్పటికీ పోరాటం ఆపేది లేదని స్పష్టం చేశారు. జూన్ 3న జరిగే సభకు రెండు ట్రాక్టర్లు, 30 బైకులతో హాజరవుతామని కామారం గ్రామ ప్రజలు శపథం చేశారు. ఆదివాసి యువకులు, నిరుద్యోగులు తమ గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహించి కొత్తగూడా సభకు భారీగా తరలి రావాలని డాక్టర్ అరుణ్ కుమార్ పిలుపునిచ్చారు.

# మత్తు పదార్థాల నిర్మూలనకు తొర్రూర్‌లో ప్రత్యేక తనిఖీలు

**నార్కోటిక్స్ జాగిలం "మ్యాక్స్"తో ట్రాన్స్‌పోర్ట్ కేంద్రాలు, పాన్ షాపులు, కిరాణా దుకాణాల్లో పోలీసుల విస్తృత తనిఖీలు**





**మహబూబాబాద్ విశాల భారతి:** : మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ పట్టణంలో మత్తు పదార్థాల నిర్మూలనకు పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ డా. శబరీష్ ఆదేశాల మేరకు శుక్రవారం తొర్రూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ తనిఖీలు చేపట్టారు. నార్కోటిక్స్ జాగిలం "మ్యాక్స్", డాగ్ హ్యాండ్లర్ శివరాజ్ సహాయంతో తొర్రూర్ ఎస్ఐ అంజలి, పోలీస్ సిబ్బంది కలిసి ట్రాన్స్‌పోర్ట్ కేంద్రాలు, పాన్ షాపులు, కిరాణా దుకాణాలు, ఇతర అనుమానాస్పద ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. మత్తు పదార్థాల అమ్మకం, కొనుగోలు, రవాణా, వినియోగాన్ని అరికట్టేందుకు ఈ తనిఖీలు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు. పాన్ షాపులు, కిరాణా దుకాణాల యజమానులకు 18 సంవత్సరాల లోపు పిల్లలకు గుట్కా, టొబాకో ఉత్పత్తులు, సిగరెట్లు, ఇతర మత్తు పదార్థాలు విక్రయించరాదని స్పష్టమైన సూచనలు ఇచ్చారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డా. శబరీష్ మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. మత్తు పదార్థాల వ్యసనం వ్యక్తిగత ఆరోగ్యానికే కాకుండా కుటుంబాలు, సమాజంపై కూడా తీవ్ర ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. జిల్లాలో మత్తు పదార్థాల నిర్మూలనకు పోలీస్ శాఖ కట్టుదిట్టమైన చర్యలు కొనసాగిస్తోందని తెలిపారు. అలాగే ప్రజలు అప్రమత్తంగా ఉండి అనుమానాస్పద వ్యక్తులు, చట్టవిరుద్ధ కార్యకలాపాలు లేదా మత్తు పదార్థాల అక్రమ రవాణాపై వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్పీ కోరారు.

# హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ ప్రవేశాలకు గిరిజన విద్యార్థుల ఎంపిక




**మహబూబాబాద్ విశాల భారతి:** సంచాలకులు గిరిజన సంక్షేమ శాఖ, హైదరాబాద్ ఆదేశాల మేరకు హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ రామంతపూర్/బేగంపేట్‌లో 202627 విద్యా సంవత్సరానికి ఒకటవ తరగతి ప్రవేశాల కోసం మహబూబాబాద్ జిల్లా స్థాయి ఎంపిక ప్రక్రియను నిర్వహించారు. ఈ ప్రవేశాలకు సంబంధించి గతంలో ఐటిడిఏ ఏటూరునాగారం ప్రాజెక్ట్ అధికారి పత్రికా ప్రకటన విడుదల చేయగా, మొత్తం 34 మంది గిరిజన విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించినట్లు ఉప సంచాలకులు (గిరిజన సంక్షేమం) కార్యాలయం వెల్లడించింది. జిల్లాకు కేటాయించిన ఆరు సీట్లలో కోయ ఉపకులానికి కేటాయించిన రెండు సీట్లకు కేవలం ఒక బాలుడు మాత్రమే దరఖాస్తు చేసుకోగా, బాలికల నుంచి ఎలాంటి దరఖాస్తులు రాలేదు. దీంతో నిబంధనల ప్రకారం ఐదుగురు విద్యార్థులను జిల్లా స్థాయి కమిటీ లాటరీ పద్ధతిలో ఎంపిక చేసింది. ఎంపికైన వారిలో నలుగురు లంబాడ ఉపకులానికి, ఒకరు కోయ ఉపకులానికి చెందిన వారు ఉన్నారు. వీరిలో ఇద్దరు బాలికలు, ముగ్గురు బాలురకు అవకాశం కల్పించారు. ఈ ఎంపిక ప్రక్రియను శుక్రవారం సాయంత్రం 4 గంటలకు ప్రాజెక్ట్ అధికారి ఐటిడిఏ ఏటూరునాగారం ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లా స్థాయి కమిటీ సభ్యులుగా ఉప సంచాలకులు దేశిరాం, జిల్లా విద్యాశాఖ అధికారి, ప్యానల్ గ్రేడ్ ప్రధానోపాధ్యాయులు వి. సారంగపాణి, డి. కోటేశ్వరి, బి. సక్రు పాల్గొన్నారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రుల సమక్షంలో లాటరీ విధానంలో ఎంపిక నిర్వహించినట్లు ఉప సంచాలకులు దేశిరాం తెలిపారు.

**ఎంపికైన విద్యార్థుల వివరాలు ఇలా ఉన్నాయి**

ఆజ్మీరా చేతన్ – తండ్రి చందూలాల్, దుండ తండ, ఉగ్గంపల్లి, చిన్నగూడూరు మండలం, బోడ అద్విక్ – తండ్రి రఘు, లచ్చిరం తండ, కురవి మండలం, భుక్య గ్యనేశ్వరి – తండ్రి చందూలాల్, పకీరతండ, నరసింహులపేట మండలం, సాయిశరణ్య – తండ్రి నరేష్, బీచురాజుపల్లి, మరిపెడ మండలం, తాటి హర్షవర్ధన్ – తండ్రి రాంబాబు, గూడూరు గ్రామం, గూడూరు మండలం, మహబూబాబాద్ జిల్లా అధికారులు ప్రకటించారు.

# రిపోర్టర్లకు ద్రోహిగా మారిన శ్రీనివాస్ రెడ్డి

**ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి తీరుపై టీజేఎస్ఎస్ ఆగ్రహం**



**హైదరాబాద్:** తెలంగాణలో జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డుల వ్యవహారం మరోసారి వివాదాస్పదంగా మారింది. కావాలని జిల్లా అక్డేషన్ కార్డులను, ఫ్రీలాన్స్ అక్రిడేషన్ కార్డులను పనికిరాని కారణాలు చూపిస్తూ రిజెక్ట్ చేయడంపై తెలంగాణ జర్నలిస్టుల సంక్షేమ సంఘం ఆగ్రహం వ్యక్తం చేసింది. రిపోర్టర్లకు ఇటీవల జరుగుతున్న అన్యాయాలపై ప్రెస్ అకాడమీ చైర్మన్‌గా ఉన్న శ్రీనివాస్ రెడ్డి వ్యవహార శైలిపై జర్నలిస్టు వర్గాల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. దశాబ్దాలుగా ఫీల్డ్‌లో పనిచేస్తున్న ఫ్రీలాన్స్ రిపోర్టర్లకు అక్రిడేషన్ కార్డులు ఇవ్వకుండా, తనకు అనుబంధంగా ఉన్న యూనియన్లు, తనకు సన్నిహితంగా ఉన్న మీడియా సంస్థల వారికే కార్డులు మంజూరు చేస్తున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ప్రెస్ అకాడమీని బలోపేతం చేయాల్సిన ప్రభుత్వాలు, పనికిరాని వ్యక్తులను కీలక పదవుల్లో కూర్చోబెట్టి జర్నలిస్టుల జీవితాలతో ఆడుకుంటున్నాయనే విమర్శలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. "తోటి జర్నలిస్టులకే న్యాయం చేయలేని వ్యక్తులకు ఇలాంటి పదవులు ఎందుకు.? అని జర్నలిస్టు సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. క్యాబినెట్ హోదా కలిగిన ప్రెస్ అకాడమీ చైర్మన్ కు అక్రిడేషన్ కార్డు ఎందుకని టీజేఎస్ఎస్ ప్రశ్నిస్తోంది. ఒక చైర్మన్ అక్రిడేషన్ కార్డు తీసుకోవడం చూస్తుంటే హాస్యాస్పదంగా ఉందని క్యాబినెట్ హోదా కలిగిన వ్యక్తి అక్రిడేషన్ కార్డును ఆశించడం సిగ్గుచేటని పేర్కొంటున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జర్నలిస్టు సంక్షేమం కోరితే వెంటనే ఫ్రీలాన్స్ జర్నలిస్టులకు తక్షణమే న్యాయం చేయాలని, అక్రిడేషన్ వ్యవస్థలో పారదర్శకత తీసుకురావాలని, అర్హులైన ప్రతి జర్నలిస్టుకు సమాన హక్కులు కల్పించాలని తెలంగాణ జర్నలిస్టు సంక్షేమ సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తోంది.

# నిమ్స్ వైద్యులను అభినందించిన సీఎం

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**




హైదరాబాద్ నగరంలోని నిజాం వైద్య విజ్ఞాన సంస్థకు చెందిన మూత్రకోశ రోగాల విభాగం ఒక అరుదైన గమ్యాన్ని చేరుకుంది. ఇప్పటివరకు రెండు వేల మందికి మూత్రపిండాల మార్పిడి వేదుకలను విజయవంతంగా ముగించి సరికొత్త రికార్డును నెలకొల్పింది. పేద ప్రజలకు ఎంతో కాలంగా మేలైన చికిత్సలు అందిస్తున్న ఈ ప్రభుత్వ సంస్థ సాధించిన ఈ అరుదైన గెలుపు బాట యావత్ తెలుగు నేలను ఆకట్టుకుంటోంది. దీర్ఘకాలిక రోగాలతో బాధపడుతున్న వేలాది మంది గుండెల్లో ఈ సంస్థ సరికొత్త వెలుగులను నింపుతూ నమ్మకమైన నిలయంగా మారుతోంది. వైద్య రంగంలో ఈ సంస్థ సాధించిన ఈ అద్భుతమైన గెలుపుపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎంతో హర్షం వ్యక్తం చేశారు. ఈ చారిత్రక విజయాన్ని అందుకున్న వైద్య నిపుణుల బృందాన్ని ఆయన ప్రత్యేకంగా మెచ్చుకున్నారు. ప్రభుత్వ రంగంలో ఇటువంటి గొప్ప విజయాలు నమోదు కావడం మన రాష్ట్రానికే ఎంతో గర్వకారణమని ఆయన కొనియాడారు. అత్యుత్తమ నైపుణ్యంతో, నిరంతర శ్రమతో పేద ప్రజల ప్రాణాలను కాపాడుతున్న వైద్యులకు, మిగిలిన పనివారికి ప్రభుత్వం ఎల్లప్పుడూ తోడుగా ఉంటుందని నమ్మకం ఇచ్చారు. ఈ అపూర్వ గెలుపు ఆసుపత్రి కీర్తి కిరీటంలో మరొక బంగారు అక్షరంగా నిలిచిపోతుందని పొగిడారు. ఈ అరుదైన మైలురాయితో ఈ ఆసుపత్రి ప్రాంతీయంగానే కాకుండా దేశ వ్యాప్తంగానూ తన ప్రత్యేకతను చాటుకుంది. మూత్రపిండాల మార్పిడి చికిత్సల విభాగంలో దక్షిణ భారతదేశంలోనే మొదటి స్థానాన్ని కైవసం చేసుకుని సరికొత్త చరిత్ర సృష్టించింది. గుజరాత్‌లోని ఐకేడీఆర్సీ సంస్థ దేశంలోనే మొదటి స్థానంలో నిలవగా, లూధియానాలోని వైద్య కళాశాల రెండవ స్థానాన్ని దక్కించుకుంది. ఈ క్రమంలో మన ఆసుపత్రి యావత్ భారతదేశంలోనే మూడవ స్థానాన్ని సొంతం చేసుకుని అత్యుత్తమ ప్రమాణాలను ప్రదర్శించింది. ఈ జాతీయ స్థాయి గుర్తింపుతో ఇక్కడి వైద్య ఖ్యాతి ఎల్లలు దాటింది. ఇక్కడ జరిగిన ఈ మొత్తం రెండు వేల చికిత్సలలో అత్యధిక భాగం పేద, మధ్యతరగతి వర్గాలకే దక్కడం ఇక్కడి సేవా నిరతికి నిదర్శనం. సుమారు పందొమ్మిది వందల మంది రోగులు, అంటే నూటికి తొంభై ఐదు వంతుల మంది రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం, ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూపాయి కూడా చెల్లించకుండా ఉచితంగా ఈ వైద్య సేవలను పొందారు. ప్రైవేట్ వైద్యశాలల్లో లక్షలాది రూపాయల ఖర్చుతో కూడుకున్న ఈ చికిత్సను, ప్రభుత్వ నిధుల తోడ్పాటుతో ఉచితంగా అందిస్తూ ఈ సంస్థ పేదల పాలిట కల్పవల్లిగా మారింది. ప్రభుత్వ సంక్షేమ పథకాలను సక్రమంగా లబ్ధిదారులకు చేర్చడంలో ఈ సంస్థ ఆదర్శంగా నిలుస్తోంది. గడిచిన మూడు సంవత్సరాల నాలుగు నెలల స్వల్ప కాలంలోనే ఇక్కడి వైద్యులు ఏకంగా ఐదు వందల మూత్రపిండాల మార్పిడి చికిత్సలను పూర్తి చేసి తమ పనివేగాన్ని చాటుకున్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి, చికిత్సల సమయాన్ని తగ్గించడంతో పాటు గెలుపు అవకాశాలను గణనీయంగా పెంచారు. ఇంత తక్కువ కాలంలో ఇన్ని వందల సంక్లిష్ట ప్రక్రియలను పూర్తి చేయడం సామాన్యమైన విషయం కాదని వైద్య విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇక్కడి వైద్యుల ఈ అంకితభావం నిరంతరం పెరుగుతున్న రోగుల రద్దీకి, వారి నమ్మకానికి అద్దం పడుతోంది. ఈ వైద్య విభాగంలో ఏర్పాటు చేసిన అత్యాధునిక వసతులు, అధునాతన పరీక్షల గదులు ఈ విజయాలలో కీలక పాత్ర పోషించాయి. అవయవ మార్పిడికి ముందు జరపాల్సిన క్లిష్టమైన జన్యు పరీక్షలు, కణజాల సరిపోలిక ప్రక్రియలను వేగంగా పూర్తి చేసేందుకు మేలైన పరికరాలను ఇక్కడ అందుబాటులో ఉంచారు. చికిత్స అనంతరం రోగులు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా చూసేందుకు ప్రత్యేక రక్షణ గదులను ఏర్పాటు చేశారు. ఈ ఆధునిక మౌలిక వసతుల కల్పన వల్లే రోగుల కోలుకునే శాతం గణనీయంగా పెరిగిందని వైద్య బృందం వెల్లడించింది. తీవ్రమైన అనారోగ్యంతో, జీవితంపై ఆశలు కోల్పోయిన మూత్రపిండాల బాధితులకు ఇక్కడి వైద్యులు పునర్జన్మను ప్రసాదిస్తున్నారు. దాతల నుంచి సేకరించిన అవయవాలను అత్యంత జాగ్రత్తగా భద్రపరిచి, గంటల తరబడి శ్రమించి రోగులకు అమరుస్తున్నారు. కేవలం చికిత్స చేయడమే కాకుండా, ఆ తర్వాత కూడా రోగుల ఆరోగ్య స్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ తగిన జాగ్రత్తలు సూచిస్తున్నారు. వైద్యుల ఆత్మీయ పలకరింపు, నిరంతర పర్యవేక్షణే తమను త్వరగా కోలుకునేలా చేస్తోందని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పేదలకు పెద్ద ఆసుపత్రుల స్థాయి వైద్యాన్ని ఉచితంగా అందించాలనే ప్రభుత్వ సంకల్పాన్ని ఈ సంస్థ అక్షరాలా నిజం చేస్తోంది. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం కింద లభించే నిధులను సమర్థవంతంగా వినియోగిస్తూ, రోగులకు అవసరమైన ఖరీదైన మందులను సైతం ఉచితంగా అందజేస్తున్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అత్యవసర పరిస్థితుల్లో ఉన్న వారికి తక్షణ ఆర్థిక సహాయం అందేలా చూస్తున్నారు. ఈ నిధుల సద్వినియోగం వల్ల నిరుపేద కుటుంబాలు అప్పులపాలు కాకుండా కాపాడబడుతున్నాయి. తెలంగాణలోని మారుమూల గ్రామీణ ప్రాంతాల నుంచే కాకుండా, పొరుగు రాష్ట్రాల నుండి సైతం వేలాది మంది రోగులు ఇక్కడి వైద్య సేవలను నమ్మి వస్తున్నారు. ఇక్కడి వైద్యులపై ప్రజల్లో ఉన్న నమ్మకమే ఈ సంస్థను దేశంలోనే అగ్రగామిగా నిలబెట్టింది. ఖరీదైన వైద్యశాలలకు వెళ్లలేని సామాన్యులకు ఈ సంస్థ ఒక ఆశాదీపంగా మారిందని, ఇక్కడి సేవల నాణ్యత ఏమాత్రం తక్కువ కాదని ప్రజలు విశ్వసిస్తున్నారు. ఈ నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ వైద్య బృందం నిరంతరం శ్రమిస్తోంది. రాబోయే రోజుల్లో రోగుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఈ ఆసుపత్రిని మరింత విస్తరించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. అదనపు పడకల ఏర్పాటుతో పాటు, అవయవ మార్పిడి విభాగాల కోసం మరికొన్ని అత్యాధునిక చికిత్స గదులను నిర్మించనున్నారు. రెండు వేల ఇరవై ఆరు నాటికి నూతన మార్పులతో వైద్య సేవలను మరింత వేగవంతం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. వైద్యులకు, పరిశోధకులకు అవసరమైన ఆధునిక శిక్షణ కార్యక్రమాలను కూడా విస్తృతం చేయనున్నారు. మొత్తానికి ఈ ఆసుపత్రి మూత్రపిండాల మార్పిడి విభాగం సాధించిన ఈ రెండు వేల విజయాల ప్రస్థానం ప్రజా ప్రగతికి ఒక దిక్సూచిలా నిలిచింది. పారదర్శకమైన సేవలు, సామాజిక న్యాయ సాధనే ధ్యేయంగా ఇక్కడి వైద్య ప్రక్రియలు సాగుతున్నాయి. అక్రమాలకు తావులేకుండా, అర్హులైన ప్రతీ ఒక్కరికీ ప్రాధాన్యత క్రమంలో వైద్య సహాయం అందేలా పటిష్టమైన విధానాన్ని అమలు చేస్తున్నారు. రాబోయే రోజుల్లో ఈ సంస్థ మరిన్ని ఆదర్శవంతమైన మైలురాళ్లను అధిగమించి, యావత్ భారతదేశంలోనే మొదటి స్థానానికి చేరుకోవడం ఖాయంగా కనిపిస్తోంది.

# మాదక ద్రవ్యాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి

**జిల్లా ఎస్పీ డా. శబరీష్**

**మహబూబాబాద్ విశాల భారతి:**

మాదక ద్రవ్యాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ డా. శబరీష్ ఆదేశించారు. శుక్రవారం మహబూబాబాద్ పట్టణ పోలీస్ స్టేషన్ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా ఎస్పీ జిల్లా పరిధిలోని పోలీస్ అధికారులతో నేర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, ప్రజా భద్రత అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ డా. శబరీష్ మాట్లాడుతూ జిల్లాలో గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గంజాయి విక్రయాలు, రవాణా, వినియోగంపై కఠిన నిఘా కొనసాగించాలని సూచించారు. హోటళ్లు, లాడ్జ్‌లు, అనుమానాస్పద ప్రాంతాల్లో తరచూ తనిఖీలు నిర్వహించాలని తెలిపారు. నకిలీ విత్తనాలు (Spurious Seeds), నకిలీ ఎరువులు విక్రయాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు. రైతులను మోసం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, వ్యవసాయ శాఖ అధికారులతో సమన్వయం చేసుకుని తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. రాత్రి పూట పటిష్టమైన నైట్ పట్రోలింగ్ నిర్వహించాలని, ప్రతి పట్రోలింగ్ అధికారి తప్పనిసరిగా పాయింట్ బుక్స్‌ను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. పట్రోలింగ్ విధుల్లో నిర్లక్ష్యం సహించబోమని హెచ్చరించారు. పెండింగ్ కేసులు, అండర్ ఇన్వెస్టిగేషన్ కేసులపై అధికారులను ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు. కేసుల దర్యాప్తు వేగవంతంగా పూర్తి చేసి నేరస్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాబోయే బక్రీద్ పండుగ సందర్భంగా జిల్లాలో శాంతియుత వాతావరణం నెలకొనేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. మత సామరస్యాన్ని కాపాడే విధంగా అప్రమత్తంగా ఉండాలని, సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు, వదంతులు వ్యాప్తి చెందకుండా కఠిన నిఘా ఉంచాలని ఆదేశించారు. ప్రజలు కూడా బాధ్యతాయుతంగా వ్యవహరించి అసత్య సమాచారాన్ని నమ్మవద్దని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, ప్రజల్లో ట్రాఫిక్ నిబంధనలపై చైతన్యం కల్పించాలని తెలిపారు. ప్రజలను సరైన మార్గంలో నడిపించే బాధ్యత పోలీసులపై ఉందని, ప్రతి పోలీస్ అధికారి ప్రజలకు ఆదర్శంగా ఉండే విధంగా విధులు నిర్వహించాలని ఎస్పీ సూచించారు. జిల్లాలో ప్రజల విశ్వాసాన్ని మరింత పెంచే విధంగా క్రమశిక్షణ, బాధ్యతతో పని చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.




# మైనింగ్ అనుమతులు వెంటనే రద్దు చేయాలి



**దేవరుప్పుల విశాలభారతి :** జనగామ జిల్లా దేవరుప్పుల మండలం లకవత్ తండా పంచాయతీ పరిధిలోని వాన కొండయ్య లక్ష్మీనరసింహస్వామి గుట్ట ప్రాంతంలో మైనింగ్ కార్యకలాపాలకు అనుమతులు మంజూరు చేయడం పట్ల స్థానిక ప్రజల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. మైనింగ్ పనుల వల్ల ఆ ప్రాంతంలోని పర్యావరణ సమతుల్యత దెబ్బతినే ప్రమాదం ఉండటమే కాకుండా, పరిసర గ్రామాల ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగే అవకాశం ఉందని డీసీసీ అధ్యక్షురాలు ధన్వంతి లక్ష్మీనారాయణ లకావత్ తెలిపారు. ముఖ్యంగా గుట్టపై ఉన్న శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయ ఉనికి, ఆధ్యాత్మిక ప్రాముఖ్యతకు ముప్పు ఏర్పడే పరిస్థితి ఉందన్నారు. ఈ ప్రాంత ప్రజలు కొండపై ఉన్న సహజ వనరులపై ఆధారపడి వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని, మైనింగ్ కార్యకలాపాల వల్ల భూగర్భ జలాలు, పంట భూములు మరియు ప్రకృతి వనరులు దెబ్బతిని రైతులకు తీవ్ర నష్టం కలిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రజల మనోభావాలు, పర్యావరణ పరిరక్షణ, దేవాలయ పరిరక్షణ మరియు రైతుల జీవనాధారాన్ని దృష్టిలో ఉంచుకొని వాన కొండయ్య లక్ష్మీనరసింహస్వామి గుట్ట వద్ద మైనింగ్ అనుమతులను వెంటనే రద్దు చేసి, ఆ ప్రాంతాన్ని పరిరక్షించాలని జిల్లా కలెక్టర్‌ను డీసీసీ అధ్యక్షురాలు ధన్వంతి లక్ష్మీనారాయణ లకావత్ కోరారు. ఈ కార్యక్రమంలో దేవరుప్పుల మండలానికి చెందిన లకవత్ తండా గ్రామ పార్టీ అధ్యక్షుడు బొడా యాకన్న, మూడో వార్డు సభ్యురాలు లకవత్ వెన్నెల (భర్త: సుధాకర్), పొట్టిగుట్ట తండా గ్రామ సర్పంచ్ అనిత (భర్త: చందులాల్), ధరవతే తండా గ్రామ సర్పంచ్ అనిత (భర్త: రవీందర్), నల్లకుంట తండా గ్రామ పార్టీ అధ్యక్షుడు భాస్కర్, సర్పంచ్‌లు, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# వివాహ వార్షికోత్సవం సందర్భంగా మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ

**పెద్దమడూర్ సర్పంచ్ పానుగంటి గిరి**



**దేవరుప్పుల విశాలభారతి :** మండలం పెద్దమడూరు గ్రామ సర్పంచ్ పానుగంటి గిరి విజయ దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా ఈరోజు ఉపాధి హామీ కూలీలకు మరియు ఐకెపి సెంటర్ హమాలీలకు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. వేసవి ఎండల తీవ్రత దృష్ట్యా వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, పనులను త్వరగా ముగించుకొని ఎక్కువగా నీరు త్రాగుతూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, వారు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

# చట్టం వేటుకు పేదలే బలి

- ఎన్ని చట్టాలు ఉన్నా బలిసినోళ్లకు అవి వర్తించవు
- ఏజెన్సీ ప్రాంతంలో విచిత్ర రాజకీయం
- పెద్దలు భూకబ్జాలు రోడ్లను ఆక్రమించిన చట్టానికి కళ్ళు కనిపించవు
- పేదోడు చిన్న పొరపాటు చేసిన అది చట్టం కిందకి రావాల్సిందే
- బలమైన చట్టాలు అమలు చేయాల్సిందే అంటారు
- మరి బలమైన చట్టం ఉన్నోడి దగ్గర ఎందుకు పనిచేయట్లేదు
- రాజకీయ పలుకుబడి ఉన్నోళ్ల ఇల్లులు చట్టానికి లోబడి ఉన్నాయా
- చట్టం పేరు చెప్పే అర్హత ఎవరికి లేదు
- చట్టం పేరు చెప్తే ఉన్నోళ్ల అక్రమ కట్టడాలు కూల్చాల్సిందే

**భద్రాచలం, విశాలభారతి;**



భద్రాచలం పట్టణంలో 1 /70 చట్టం ఒక బలమైన చట్టం దానిని అనుసరించే ఇక్కడ ఏ కట్టడమైన కట్టాలి కానీ ఈ చట్టాన్ని అనుసరిస్తున్నార అమలు చేస్తున్నారా అంటే లేదనే చెప్పాలి అది పెద్దల దగ్గర అపహాస్యం పాలు అవుతుంది. బీదల దగ్గర కు వచ్చేసరికి ఈ ఆదివాసి చట్టం కనిపిస్తుంది. అంటే ఉన్నోడి దగ్గర ఆదివాసి బలమైన చట్టం నీరుగారిపోతుంది. డబ్బుల లావాదేవీలు పలుకుబడి వెరసి ఏ కట్టడమైన ఏ అడ్డంకులు లేకుండా వెలుస్తాయి. ఆక్రమణకు గురవుతాయి. పేదోడికి బక్కోళ్ల ఇంటి దగ్గరికి స్థలాల దగ్గరికి వచ్చేసరికి కాగితాలు, చట్టాలు నీతులు వల్లిస్తూ వారి కట్టడాల పైన వీళ్ళ జులుం కనబరుస్తూ ఉంటారు. రాజకీయాలను అడ్డుపెట్టుకొని చట్టం తమ చుట్టాలుగా చేసుకుంటున్నారు . అధికారులను రాజకీయ బలంతో వారి వైపు మలుసుకుని వారి అక్రమ కట్టడాలు యదేచ్ఛగా కొనసాగిస్తున్నారు. భద్రాచలం పట్టణంలో ఎన్ని బహుళ అంతస్తులు నిర్మాణాలు ఏజెన్సీ చట్టాలకు విరుద్ధంగా కట్టటం లేదా దాన్ని ఎవరు ప్రశ్నించారు .ఎందుకు అంటే వారు పెద్దోళ్ళు డబ్బున్నోళ్లు వారి జోలికి ఎవరూ పోరు పోయిన మొరిగే కుక్కకు కండ అడ్డమేసినట్లు ఎంతో కొంత డబ్బులు ఇచ్చి వారి కట్టడాలకు అడ్డంకులు లేకుండా చేసుకుంటున్నారు. భద్రాచలం బ్రిడ్జి దగ్గర నుంచి మొదలుకొని రాజుపేట చివరి వరకు అటు కూనవరం రోడ్డు దాకా డ్రైనేజీలపైనే బహుళ అంతస్తుల నిర్మాణాలకట్టడాలు ,గోడలు ఉన్నాయి రేకులతో షెడ్లు వేసుకుని వ్యాపారాలు చేసుకుంటున్న వారు అనేకమంది ఉన్నారు .డ్రైనేజీల పైన అక్రమ కట్టడాలను ఎవరూ ప్రశ్నించరు. హైవే రోడ్లను ఆక్రమించి బహుళ అంతస్తులు నిర్మాణాలు కొనసాగిస్తున్న వారిని మందలించరు ఎందుకంటే వాళ్లు రాజకీయ నాయకులు భద్రాచలాన్ని అయానో ,భయానో చేసి రాజ్యమేలుతున్నారు. వివిధ కాలనీలలో అనేక రోడ్లను అక్రమించి భవనాలు నిర్మించుకున్నారు వాళ్ల జోలికి ఎవరూ పోరు, చిన్నాచితక కుటుంబాలు దగ్గరికి వచ్చేసరికి పంచాయతీరాజ్ చట్టం, గ్రామ పంచాయతీ చట్టాలు చూపించి దౌర్జన్యంగా వారు చేయాల్సిన పని చేసేస్తున్నారు .ఇది ఎక్కడి న్యాయం చట్టం అందరికీ ఒకేలా ఉండాలి కానీ ఉన్నోళ్లకు ఒక న్యాయం లేని వాడికి ఒక న్యాయమా ఇదేనా నీతి భద్రాచలంలో ఎన్ని కట్టడాలు లేవు దమ్ముంటే వాటిని కూల్చేస్తారా హైవే రోడ్లపై అక్రమ నిర్మాణాలు వీటి సంగతి ఏంటి తేలుస్తారా పిసా చట్టం, ఏం చెప్తుంది ఏజెన్సీలో వ్యాపారాలు కేవలం గిరిజనులే చేయాలి . ప్రభుత్వం లైసెన్సును కేవలం గిరిజనులకి ఇవ్వాలి. వ్యాపారాలకు గిరిజనులకు లైసెన్సు ఇస్తున్నారు .అంతవరకు బానే ఉంది. ఆ లైసెన్స్ పై ఎవరు వ్యాపారం చేస్తున్నారు . కోట్ల రూపాయలు ప్రజలను మోసం చేసి ఎవరు సంపాదిస్తున్నారు. మరి ఇక్కడ చట్టం ఎందుకు ఉల్లంఘించబడుతుంది. ఎందుకు బినామీలు ఏజెన్సీలో ఉంటున్నారు. దీన్ని ఏ అధికారి ఏ రాజకీయ నాయకుడు ఎందుకు ప్రశ్నించట్లేదు .ఎవరి వాటా వారికి ముట్టేసరికి పిశాచట్టం గొంతు పిసుకుతారా పేదోడి పైన మీ జులుం చూపుతారా పార్టీలను అడ్డుపెట్టుకొని పదవులు అడ్డుపెట్టుకొని చట్టాలను విచ్ఛిన్నం చేస్తారా గతంలో ఒక పేదోడు కట్టుకున్న ఇంటిపైన ఎవరెవరో వచ్చి పంచాయతీలు చేసి పోతారు అది అక్కడితో మంచో చెడో సద్దుమణిగిపోద్ది మళ్లొక కొత్త హీరో వస్తాడు పనికిమాలిన వాడు కాచుకొని కూర్చున్న గుంట నక్కలు మళ్లీ తిరిగి దాన్ని తోడుతారు. మళ్లీ మొదటికి వస్తది వాడి ఇంటి పైన వాడి జాగ పైన పంచాయతీ దిక్కుతోచని బక్కోడి ప్రాణం విలవిలలాడిపోతుంటుంది. అక్కడకు వచ్చేసరికి అక్రమ కట్టడాలను కూల్చాలి. వాళ్ల సంగతి తేల్చాలి అని ఓ పెద్ద పెద్ద డైలాగులు మేమే తోపులమని డైలాగులతో మారుమోగుతా ఉంటది. ఛీ మీ బతుకులు మీ ఒక బతుకు లేనా రా బక్కోడు పై చట్టాలను ప్రయోగిస్తారు ఉన్నోళ్లపై చట్టాలకు చుట్టాలు లెక్క చూపిస్తారా ఎక్కడో అక్కడ మీ అన్యాయానికి మీ అక్రమాలకు చరమగీతం పాడాల్సి వస్తుంది. ఖబర్దార్ బిడ్డ

# ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

2047 నాటికి తెలంగాణ రాష్ట్రాన్ని 3 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థగా నిలిపేందుకు ప్రజా ప్రభుత్వం కృతనిశ్చయంతో పనిచేస్తోందని ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. సంక్షేమ పథకాలు, ఆర్థిక స్వావలంబన, ఫ్యూచర్ సిటీ నిర్మాణం, మహిళా సాధికారత, మూసీ పునరుజ్జీవంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రథమ ప్రాధాన్యతలను ఇస్తోందని ఆయన వివరించారు. శుక్రవారం మహాత్మాజ్యోతి రావు పూలే ప్రజాభవన్ వేదికగా జరిగిన 49వ రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర సత్వర ప్రగతిలో బ్యాంకులు కేవలం ఆర్థిక లావాదేవీలకే పరిమితం కాకుండా భాగస్వామ్యం వహించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో బ్యాంకుల మొత్తం డిపాజిట్లు దాదాపు రూ.9.43 లక్షల కోట్లకు చేరుకోవడం, అడ్వాన్సులు రూ.12.34 లక్షల కోట్లకు పెరగడం శుభపరిణామమని డిప్యూటీ సీఎం కొనియాడారు. తెలంగాణ 130.78 శాతం క్రెడిట్ డిపాజిట్ నిష్పత్తితో ముందుకు సాగడం అద్వితీయమన్నారు. వ్యవసాయ రుణాల విషయంలో లక్ష్యాలను మించి బ్యాంకులు రుణాలు ఇవ్వడంపై సంతోషం వ్యక్తం చేశారు. రూ.1,65,297 కోట్ల లక్ష్యానికి గాను రూ.1,68,401 కోట్ల వ్యవసాయ రుణాలు పంపిణీ చేసి 101.88 శాతం ప్రగతిని సాధించడం గర్వించదగ్గ విషయమని ప్రశంసించారు. వ్యవసాయం తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు నిజమైన వెన్నెముక అని పేర్కొన్నారు. రైతులు, పాడి రైతులు, మత్స్యకారులు, అనుబంధ రంగాలకు కిసాన్ క్రెడిట్ కార్డు వంటి పథకాల ద్వారా బ్యాంకులు అందిస్తున్న మద్దతు అభినందనీయమన్నారు. పారిశ్రామిక రంగంలో దేశంలోనే అత్యంత వేగవంతంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటని భట్టి విక్రమార్క గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో బ్యాంకులు సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. మహిళా, దళిత, గిరిజన యువ




పారిశ్రామికవేత్తలకు రుణాల పంపిణీ వేగవంతం చేయాలని కోరారు. విద్యార్థులకు ఇచ్చే విద్యా రుణాల విషయంలో బ్యాంకులు మరింత సానుకూల దృక్పథంతో, ఉదారంగా ముందుకు రావాలన్నారు. విద్యార్థులకు ఇచ్చే రుణాలు యువతపై మనం పెట్టే భవిష్యత్ పెట్టుబడిగా భావించాలని ఆయన దిశానిర్దేశం చేశారు. సంక్షేమం, ప్రగతి రెండింటిని జోడెడ్లుగా పరుగులు తీయగలవని ప్రజా ప్రభుత్వం చేతల్లో నిరూపించిందన్నారు. సమగ్రాభివృద్ధి, రైతు సంక్షేమం, మహిళా సాధికారత, ఉపాధి సృష్టి పట్ల మా ప్రభుత్వం కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు. నేడు ప్రపంచమంతా పునరుత్పాదక ఇంధనరంగంపై దృష్టి సారిస్తోందని డిప్యూటీ సీఎం వెల్లడించారు. అందులో భాగంగా ప్రజాప్రభుత్వం కూడా సౌరశక్తి విభాగంలో స్థిరమైన ప్రగతిని సాధిస్తోందని వివరించారు. సౌరశక్తి ప్రాజెక్టులు, రూఫ్‌టాప్ సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు, పర్యావరణ అనుకూల కార్యక్రమాలకు బ్యాంకులు చురుగ్గా రుణ సహాయం అందించాలని సూచించారు. సామాజిక భద్రత, బీమా పథకాల పరిధిలోకి రాష్ట్ర ప్రజలను పెద్దఎత్తున తీసుకురావాలన్నారు. బ్యాంకులు కేవలం డబ్బు డిపాజిట్ చేసే, రుణాలు ఇచ్చే ఆర్థిక సంస్థలు గానే కాకుండా, రాష్ట్ర వ్యూహాత్మక అభివృద్ధి భాగస్వాములుగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ప్రజల కష్టార్జితం అంతా బ్యాంకులకే చేరుతుందని, కాబట్టి ఆ నిధులను ఏ రంగాల అభివృద్ధికి రుణాలుగా ఇస్తున్నామనేది అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశమని భట్టి పేర్కొన్నారు. రాష్ట్ర ఆర్థిక వృద్ధికి, ఉపాధి కల్పనకు ఏ రంగం ఎక్కువ దోహదపడుతుందో ఆలోచించి బ్యాంకులు వ్యూహాత్మకంగా రుణాలు అందించాలన్నారు. ప్రజాప్రభుత్వం 2047 ఆర్థిక సంవత్సరం నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలని ఒక బృహత్తర లక్ష్యంగా పెట్టుకుందని వివరించారు. తెలంగాణ ప్రస్తుత ఆర్థిక వృద్ధి రేటును పరిశీలిస్తే ఈ మైలురాయిని చేరుకోవడం సాధ్యమేనని స్పష్టం చేశారు. ప్రస్తుతం దేశ సగటు వృద్ధి రేటు 8.2 శాతంగా ఉంటే, మన తెలంగాణ వృద్ధి రేటు 10.7 శాతంతో దూసుకుపోతోందని ఆర్థిక మంత్రి గణాంకాలతో వివరించారు. దేశ సగటు తలసరి ఆదాయం రూ.2.1 లక్షలుగా ఉంటే, తెలంగాణ తలసరి ఆదాయం రూ.4.18 లక్షలతో దేశంలోనే అగ్రగామిగా ఉందని గర్వంగా ప్రకటించారు. మూసీ నది పునరుజ్జీవనం, సిటీ నిర్మాణం, రీజినల్ రింగ్ రోడ్ నిర్మాణం అత్యంత వేగంగా పూర్తి చేయడం ప్రధాన లక్ష్యాలుగా నిర్దేశించుకుని ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. తెలంగాణలో పట్టణీకరణ వేగంగా జరుగుతున్న నేపథ్యంలో సేవల రంగానికి రాబోయే రోజుల్లో అపారమైన అవకాశాలు ఉంటాయని చెప్పారు. మహిళా ఆర్థిక సాధికారత కోసం రాష్ట్రంలోని స్వయం సహాయక సంఘాల వడ్డీ లేని రుణాలు రూ. 5 లక్షల నుంచి రూ. 10 లక్షలకు పెంచుతున్నట్లు డిప్యూటీ సీఎం ఈ వేదికపై సంచలన ప్రకటన చేశారు. ఈ సంవత్సరం హైదరాబాద్ నగరంలో మహిళా సంఘాలకు రుణ పంపిణీపై యుద్ధప్రాతిపదికన దృష్టి సారించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. భాగ్యనగరం మహిళలకు వ్యాపార రంగంలో, చిన్న, మధ్యతరహా పరిశ్రమల్లో ఎదగడానికి ఎన్నో అవకాశాలను కల్పిస్తోందని చెప్పారు. నగరంలోని మురికివాడల్లో నివసించే యువ మహిళా పారిశ్రామికవేత్తల ఉన్నతిపై బ్యాంకర్లు ప్రత్యేకంగా దృష్టి సారించాలని కోరారు. రాష్ట్రంలో త్వరలోనే అనేక ఇండస్ట్రియల్ హబ్‌లు, క్లస్టర్లను తీసుకువస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి వెల్లడించారు. ఇందులో భాగంగా ఫార్మా, ఫ్యాబ్ సిటీ, స్టీల్, లెదర్, టెక్స్‌టైల్ వంటి వివిధ రంగాలను వినూత్నంగా డిజైన్ చేస్తున్నట్లు చెప్పారు. దీని ద్వారా జాతీయ, అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించడమే తెలంగాణ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. విప్లవాత్మక విధానాల ద్వారా పారిశ్రామిక రంగాన్ని కొత్త పుంతలు తొక్కిస్తామని నొక్కి చెప్పారు. ఈ ఉన్నత స్థాయి రాష్ట్ర బ్యాంకర్ల సమావేశంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు పాల్గొని మాట్లాడారు. రైతు సంక్షేమ పథకాలకు బ్యాంకులు మరింత ఉదారంగా సహకరించాలని కోరారు. ప్రభుత్వ ప్రాధాన్యతలను గుర్తించి రుణాల పంపిణీ ప్రక్రియను సులభతరం చేయాలని బ్యాంకర్లకు సూచించారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి వ్యవసాయ అనుబంధ రంగాలు ఎంతో కీలకమని, ఆయా రంగాల అభ్యున్నతికి బ్యాంకులు పెద్దపీట వేయాలని స్పష్టం చేశారు. ఈ ప్రతిష్టాత్మక సమావేశంలో ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ దాన కిషోర్, ఫైనాన్స్ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా పాల్గొని పలు సూచనలు చేశారు. ఫైనాన్స్ ప్లానింగ్ సెక్రెటరీ గౌరవ్ ఉప్పల్, ఆర్బీఐ రీజనల్ డైరెక్టర్ చిన్మయ మోహన్ సైతం హాజరై రాష్ట్ర ఆర్థిక ప్రగతిని సమీక్షించారు. ఎస్బీఐ సీజీఎం నీలేష్ ద్వివేది పాల్గొని రాష్ట్ర ప్రగతిలో భాగస్వామ్యం పట్ల తమ సంసిద్ధతను వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలో వివిధ బ్యాంకుల ఉన్నతాధికారులు, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శులు పాల్గొని ఆర్థిక ప్రణాళికలపై విస్తృతంగా చర్చించారు.

## నారాయణపేటలో దివ్యాంగులకు సహాయ ఉపకరణాల పంపిణీ

**ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా కార్యక్రమం నిర్వహణ**



**విశాల భారతి, అబ్దుల్లాపూర్ మెర్:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక - 99 రోజుల యాక్షన్ ప్లాన్"లో భాగంగా నారాయణపేట జిల్లా గాయత్రి ఫంక్షన్ హాల్‌లో జిల్లా సంక్షేమ శాఖ మరియు తెలంగాణ దివ్యాంగుల సహకార సంస్థ ఆధ్వర్యంలో దివ్యాంగులకు సహాయ ఉపకరణాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి హాజరుకాగా, తెలంగాణ దివ్యాంగుల సహకార సంస్థ చైర్మన్ ముత్తినేని వీరయ్య, జిల్లా కలెక్టర్ సి.హెచ్. ప్రియాంక, అదనపు కలెక్టర్ ఎస్. శ్రీను, మక్తల్, నారాయణపేట, మద్దూర్, కోస్గి మున్సిపల్ చైర్మన్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దివ్యాంగుల స్వయం ఆధారిత జీవనానికి దోహదపడే విధంగా 34 రిట్రోఫిటెడ్ మోటార్ వాహనాలు, ఒక మొబైల్ బిజినెస్ బ్యాటరీ ట్రైసైకిల్ (ఎంపవర్ కార్ట్), ఆరు ట్యాబ్‌లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ... దివ్యాంగుల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దివ్యాంగుల సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. తెలంగాణ దివ్యాంగుల సహకార సంస్థ చైర్మన్ ముత్తినేని వీరయ్య మాట్లాడుతూ.. ఇద్దరు దివ్యాంగులు వివాహం చేసుకుంటే కల్యాణ లక్ష్మి పథకంతో పాటు అదనంగా రూ.2 లక్షల వివాహ ప్రోత్సాహకాన్ని ప్రభుత్వం అందిస్తోందన్నారు. అలాగే బాల భరోసా కార్యక్రమం ద్వారా చిన్నారులకు శస్త్రచికిత్సలు నిర్వహించి సాధారణ జీవితం గడిపేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లా కలెక్టర్ సి.హెచ్. ప్రియాంక మాట్లాడుతూ.. దివ్యాంగ మహిళలు ప్రభుత్వం అందిస్తున్న సహాయ ఉపకరణాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. స్వయం సహాయక సంఘాల్లో చేరి ఆర్థికంగా ఎదగాలని కోరారు. జిల్లా సంక్షేమ శాఖ అధికారి ఎల్. రాజేందర్ గౌడ్ మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి దివ్యాంగునికి సహాయ పరికరాలు అందజేస్తామని తెలిపారు. ఇప్పటివరకు పొందని వారు తిరిగి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో ఎల్. రమేష్, డీపీవో సుధాకర్ రెడ్డి, ఫీల్డ్ రెస్పాన్స్ ఆఫీసర్ సాయి, జిల్లా అధికారులు, లబ్ధిదారులు, దివ్యాంగులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## 10 ఎకరాల ప్రభుత్వ భూమి కాపాడిన హైడ్రా

**రాజేంద్రనగర్, విశాల భారతి :** ప్రభుత్వ భూములపై జరుగుతున్న అక్రమ కబ్జాలకు చెక్ పెట్టేందుకు అధికారులు కఠిన చర్యలు చేపట్టారు. శంషాబాద్ మండల పరిధిలోని ఎయిర్‌పోర్ట్ కాలనీ సమీపంలో ఉన్న సర్వే నెంబర్ 626/1లోని సుమారు 10 ఎకరాల ప్రభుత్వ భూమిని హైడ్రా మరియు రెవెన్యూ శాఖ అధికారులు సంయుక్తంగా కాపాడారు. కోట్ల రూపాయల విలువ కలిగిన ఈ భూమిపై ఇటీవల అక్రమ నిర్మాణాలు చేపట్టిన విషయం వెలుగులోకి రావడంతో అధికారులు వెంటనే రంగంలోకి దిగారు. తహసీల్దార్ అమరలింగం గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం, ఈ భూమికి సంబంధించి గతంలో కోర్టులో వివాదం కొనసాగింది. కొంతకాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ కేసు ఇటీవల వెకేట్ కావడంతో, కొందరు అక్రమార్కులు పరిస్థితిని తమకు అనుకూలంగా మార్చుకునేందుకు ప్రయత్నించారు. ఔటర్ రింగ్ రోడ్‌కు సమీపంలో ఉండటంతో ఈ భూమికి భారీ డిమాండ్ ఉండగా, అదే అవకాశంగా భావించి నిర్మాణ కార్యకలాపాలు ప్రారంభించారు. ఈ విషయం గమనించిన తహసీల్దార్ వెంటనే హైడ్రా అధికారులకు సమాచారం అందించారు. అనంతరం రెవెన్యూ సిబ్బంది, హైడ్రా బృందాలు మరియు భారీ పోలీస్ బలగాలతో కలిసి గురువారం ఉదయం సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అక్కడ ఇప్పటికే నిర్మాణంలో ఉన్న భవనాలు, తాత్కాలిక షెడ్లు, ఇతర నిర్మాణాలను జేసీబీ యంత్రాల సహాయంతో కూల్చివేశారు. ఈ చర్యల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు కట్టుదిట్టంగా ఏర్పాటు చేశారు. అధికారులు స్పష్టం చేస్తూ, ప్రభుత్వ భూములను ఆక్రమించే వారిపై ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్ష ఉండదని హెచ్చరించారు. భూకబ్జాలకు పాల్పడితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. భూమి విలువ కోట్ల రూపాయల్లో ఉండటంతో దానిని కాపాడటం ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఇక స్థానికులు అధికారుల చర్యలను అభినందిస్తూ, ఇలాంటి దాడులు కొనసాగాలని కోరుతున్నారు. ప్రభుత్వ ఆస్తులను రక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, భూకబ్జాలను అరికట్టేందుకు నిరంతర చర్యలు అవసరమని అభిప్రాయపడ్డారు. మొత్తానికి, శంషాబాద్‌లో జరిగిన ఈ ఘటన ప్రభుత్వ భూముల రక్షణలో అధికారుల కట్టుదిట్టమైన వైఖరిని మరోసారి చాటిచెప్పింది.



## చట్టాన్ని చేతుల్లోకి తీసుకున్న 8 మందిపై కేసు

**ముగ్గురు రిమాండ్ – బొలెరో, సెల్‌ఫోన్లు, నగదు స్వాధీనం**

**ఆదిలాబాద్ , విశాలభారతి:**

చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని ఇద్దరు వ్యక్తులను గ్రామానికి తీసుకువెళ్లి కట్టివేసి దాడి చేసిన ఘటనలో ఎనిమిది మందిపై సిరికొండ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఇచ్చోడ రూరల్ సీఐ సిహెచ్ రమేష్ తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం, గురువారం చిన్న గోధుమల గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు తమ గ్రామానికి చెందిన పెందూర్ కృష్ణ ఎడ్లను గుండాల గ్రామానికి చెందిన షేక్ జలాల్ దొంగలించాడని అనుమానించారు. అలాగే సాలేవాడ గ్రామానికి చెందిన రాబిన్ సింగ్ తన బొలెరో వాహనంలో ఎడ్లను తరలిస్తున్నాడని భావించి, ఇద్దరినీ పట్టుకుని చిన్న గోధుమల గ్రామానికి తీసుకువచ్చారు. అనంతరం తాళ్లతో కట్టివేసి కట్టెలతో దాడి చేసినట్లు పోలీసులు తెలిపారు. అంతేకాకుండా, ఎడ్ల దొంగతనం చేశారంటూ పంచాయితీ పెట్టి రూ.1 లక్ష జరిమానా చెల్లించాలని బెదిరించినట్లు సమాచారం. లేదంటే చంపేస్తామని హెచ్చరించి, షేక్ జలాల్ వద్ద నుంచి రూ.5 వేల నగదు బలవంతంగా తీసుకున్నట్లు, రాబిన్ సింగ్ వద్దనున్న బొలెరో వాహనాన్ని కూడా లాక్కున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటనపై షేక్ జలాల్ కుమారుడు షేక్ అమీర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సిరికొండ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కేసులో సిదాం



ఈశ్వర్, పెందూర్ కృష్ణ, కోట్లాక్ సూర్యభాన్, సిదాం బాలాజీ, సిదాం రాంపాల్, కిషన్ పటేల్, పెందూర్ గుణవంత్ రావు, నందు తదితరులపై కేసు నమోదు చేశారు. ఈ రోజు A1 సిదాం ఈశ్వర్, A2 పెందూర్ కృష్ణ, A3 కోట్లాక్ సూర్యభాన్‌లను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ రమేష్ వెల్లడించారు. నిందితుల వద్ద నుంచి ఒక బొలెరో వాహనం, మూడు సెల్‌ఫోన్లు, రూ.2 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ రమేష్ మాట్లాడుతూ, "చట్టం దృష్టిలో ప్రతి ఒక్కరూ సమానమే. ఎలాంటి పరిస్థితుల్లోనూ చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దు. ఎవరైనా నేరానికి పాల్పడ్డారనే అనుమానం ఉంటే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. వ్యక్తులను కట్టివేయడం, దాడి చేయడం, బెదిరించడం, డబ్బులు వసూలు చేయడం వంటి చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవు" అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ విక్రమ్‌తో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## అన్నం పెట్టిన ఇంటికే కన్నం..





- **బీరువా ఖాళీ చేసిన ఎదురింటి వ్యక్తి?**
- **బంగారు గొలుసు, రూ.20 వేల నగదు మాయం.. పోలీసుల ఎదుటే పరస్పర ఆరోపణలు**
- **మద్యం మత్తులో ఇంటికి వచ్చి భోజనం చేసిన వ్యక్తిపై అనుమానం**
- **ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి బీరువాలోని బంగారం, నగదు అపహరణ ఆరోపణ**
- **పోలీస్ స్టేషన్‌లో ఒకరిపై ఒకరు నెపం వేసుకున్న నిందితులు**

**సత్తుపల్లి, విశాలభారతి :**

సత్తుపల్లి మండలం బేతుపల్లి గ్రామంలోని గంగారం ప్రకాశ్‌నగర్ కాలనీలో జరిగిన చోరీ ఘటన స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఎదురింటి వ్యక్తికి ఆకలిగా ఉంది అన్నం పెట్టండని అడిగితే ఇంటికి పిలిచి భోజనం పెట్టిన మహిళ ఇంట్లోనే అనంతరం చోరీ జరగడం కలకలం రేపుతోంది. బాధితురాలు రావులపల్లి కుమారి తెలిపిన వివరాల ప్రకారం.. మార్చి 19న ఎదురింటి వ్యక్తి తగరం కృష్ణ మద్యం మత్తులో తన ఇంటికి వచ్చి అన్నం పెట్టాలని కోరగా పరిచయం ఉన్న వ్యక్తి కావడంతో అనుమానం లేకుండా భోజనం పెట్టినట్లు తెలిపింది. అదే సమయంలో తన కుమారుడి మెడలో ఉన్న బంగారు గొలుసును తీసి బీరువాలో పెట్టిన దృశ్యాన్ని తగరం కృష్ణ గమనించినట్లు పేర్కొంది. మరుసటి రోజు తాను పనికి వెళ్లగా, కుమారుడు కూడా బయటకు వెళ్లిన సమయంలో ఇంట్లో ఎవరూ లేని అవకాశాన్ని ఉపయోగించుకుని తగరం కృష్ణతో పాటు అతని భావమరుదులు, కుటుంబ సభ్యులు కలిసి బీరువాలో ఉన్న బంగారు గొలుసు మరియు రూ.20 వేల నగదును అపహరించినట్లు ఆరోపించింది. సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా బీరువాలో బంగారం, నగదు కనిపించకపోవడంతో ఆందోళనకి గురైన బాధితురాలు, అనుమానంతో తగరం కృష్ణను ప్రశ్నించగా గొడవకు దిగినట్లు తెలిపింది. అనంతరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసుల ఎదుటే తగరం కృష్ణ అతని భావమరుదులపై ఆరోపణలు చేయగా, వారు మాత్రం కృష్ణే చోరీ చేశాడని ఆరోపించినట్లు సమాచారం. ఘటనపై ఇప్పటివరకు స్పష్టమైన చర్యలు తీసుకోలేదని బాధితురాలు వాపోయింది. తనకు చెందిన బంగారం, నగదు తిరిగి ఇప్పించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుని న్యాయం చేయాలని పోలీసులను కోరింది.



## డంపింగ్ యార్డ్ కు చెత్త చెదారం సక్రమంగా నిర్వహించాలి

**మూడు గ్రామ పంచాయతీల సెక్రటరీలకు గ్రామస్తులు వినతి పత్రాలు**

**వాజేడు, విశాలభారతి:** ములుగు జిల్లా వాజేడు మండల పరిధి ధర్మవరం నుండి చెరుకూరు వెళ్లే ప్రధాన రహదారికి ఇరువైపులా చెత్తను వేస్తున్నందున అట్టి చెత్త చెదారం దుర్గంధం వెదజల్లుతూ వాతావరణం కాలుష్యం అవుతున్నది చెత్త చెదారం లో ప్లాస్టిక్ సంచులు ఉండడంతో పశువులు వాటిని తిని అనారోగ్యానికి గురై చనిపోతున్నాయి. రోడ్డుకు ఇరువైపులా చెత్త వేస్తున్న వ్యక్తులు పై వ్యాపారస్తులపై తగిన చర్యలు తీసుకొని పశువులను పర్యావరణాన్ని కాపాడాలని చెత్త చెదారంను పంచాయితీ ట్రాక్టర్ ద్వారా సేకరించి డంపింగ్ యార్డ్ కు తరలించి తడి చెత్త పొడి వేరుచేసి దాని ద్వారా ఆదాయాన్ని సమకూర్చే విధంగా చర్యలు తీసుకోవాలనిధర్మవరం, అయ్యవారిపేట, చింతూరు గ్రామపంచాయతీల యువకులు, మూడు గ్రామ పంచాయతీల కార్యదర్శిలకు దరఖాస్తులు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో గౌరారపు చంద్రశేఖర్, ముత్తెబోయిన మహేందర్, కుమ్మరి శ్రీనాథ్ పాల్గొన్నారు.


## ధాన్యం కొనుగోళ్లపై సచివాలయం ఎదుట ధర్నా

**పండించిన పంటను కొనుగోలు చేయాలి.. రైతులను ఆదుకునే బాధ్యత ప్రభుత్వానిదే**




**ఆదిలాబాద్, విశాలభారతి:** రైతులు పండించిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి, తరుగు పేరిట బస్తాలకు కోత పెట్టడం నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ టీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం సచివాలయం వద్ద ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ ధర్నాలో టీఆర్‌ఎస్ చీఫ్ కవితతో పాటు బోథ్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావుపాల్గొని రైతుల సమస్యలపై ప్రభుత్వ దృష్టిని ఆకర్షించే ప్రయత్నం చేశారు. ధర్నా సందర్భంగా టీఆర్‌ఎస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో సచివాలయం వద్దకు చేరుకుని రైతులు పండించిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని, తరుగు పేరుతో రైతులకు నష్టం కలిగించవద్దని డిమాండ్ చేశారు. చేతుల్లో ప్లకార్డులు ప్రదర్శిస్తూ రైతులకు మద్దతుగా నినాదాలు చేశారు. రైతులు కష్టపడి పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో ఆలస్యం చేయడం వల్ల తీవ్ర ఇబ్బందులుఎదుర్కొంటున్నారని నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. కొనుగోలు ప్రక్రియలో జాప్యం కారణంగా రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారని, పైగా తరుగు పేరిట ప్రతి బస్తాపై కోతలు విధించడం వల్ల మరింత భారంగా మారుతోందని విమర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడిన నాయకులు, రైతుల కష్టానికి తగిన గౌరవం ఇవ్వాలంటే ప్రభుత్వం వెంటనే ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని కోరారు. రైతులు పండించిన పంటను సమయానికి కొనుగోలు చేయకపోతే వారి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. ధర్నా కార్యక్రమంలో పాల్గొన్న టీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో సచివాలయ పరిసరాలను హోరెత్తించారు. రైతులకు న్యాయం చేయాలని, కొనుగోలు కేంద్రాల్లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రైతుల పక్షాన టీఆర్‌ఎస్ పార్టీ ఎప్పటికీ పోరాడుతుందని, ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి అన్యాయం జరిగినా సహించబోమని పార్టీ నేతలు స్పష్టం చేశారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం అవసరమైతే మరింత పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ప్రస్తుతం రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్ల అంశం రాజకీయంగా కూడా చర్చనీయాంశంగా మారగా, సచివాలయం వద్ద టీఆర్‌ఎస్ చేపట్టిన ధర్నా రైతు సమస్యలపై మరోసారి దృష్టిని సారించింది.


## ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక.. 99 రోజుల కార్యక్రమం




**రాజేంద్రనగర్, విశాలభారతి :** ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈరోజు రంగారెడ్డి జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో జిల్లా స్థాయి సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశంలో చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి గారితో కలిసి ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి గారి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు మల్ రెడ్డి రంగారెడ్డి, ఈర్లపల్లి శంకర్, కాలే యాదయ్య, కసిరెడ్డి నారాయణ రెడ్డి, రాష్ట్ర రైతు కమిషన్ చైర్మన్ కోదండ రామ్ రెడ్డి, వివిధ కార్పొరేషన్ చైర్మన్లు మల్ రెడ్డి రాంరెడ్డి, జ్ఞానేశ్వర్, నర్సింహారెడ్డి తదితర ప్రజాప్రతినిధులు మరియు జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## ఓఆర్ఆర్‌పై ఘోర రోడ్డు ప్రమాదం

**లారీని ఢీకొన్న కారు.. సాఫ్ట్‌వేర్ ఉద్యోగి దుర్మరణం**




**రాజేంద్రనగర్, విశాలభారతి:** హిమాయత్‌సాగర్ ఔటర్ రింగ్ రోడ్డుపై జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి చెందిన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భవాని కాలనీకి చెందిన ప్రభాత్ కుమార్ ఝా (35) సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం రాయదుర్గంలోని సిట్‌కో కార్యాలయానికి వెళ్లేందుకు వ్యాగన్‌ఆర్ కారులో రాజేంద్రనగర్ ఓఆర్ఆర్ మార్గంగా గచ్చిబౌలి వైపు ప్రయాణిస్తున్నాడు. ఈ క్రమంలో ఎగ్జిట్ 18 సమీపంలోని ట్రక్ బేలో నిలిపి ఉంచిన లారీని అతివేగంగా వెనుక నుంచి ఢీకొట్టాడు. ఢీకొట్టిన ప్రభావంతో కారు ముందు భాగం పూర్తిగా లారీ వెనుక భాగంలోకి చొచ్చుకుపోయింది. ప్రమాదంలో ప్రభాత్ కుమార్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు సమాచారం ఇవ్వడంతో ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఎస్సై రాఘవేందర్ తెలిపారు.

## నేటి నుంచే అగ్రివర్సిటీ నాణ్యమైన విత్తనాల విక్రయాలు




**రాజేంద్రనగర్, విశాలభారతి :** ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నాణ్యమైన విత్తనాల విక్రయాలు నేటి నుంచే ప్రారంభమయ్యాయి. విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య వెల్లడించిన ప్రకారం, వివిధ పరిశోధనా కేంద్రాలు, రైతు విజ్ఞాన కేంద్రాలు మరియు కృషి విజ్ఞాన కేంద్రాల్లో శాస్త్రవేత్తల ప్రత్యక్ష పర్యవేక్షణలో ఉత్పత్తి చేసిన సుమారు 1230 టన్నుల నాణ్యమైన మూల విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచారు. రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన 27 విక్రయ కేంద్రాల్లో ఈ నెల 23 నుండి 30 వరకు నిర్వహించే "విత్తన వారోత్సవాలు"లో భాగంగా ఈ విక్రయాలు కొనసాగనున్నాయి. ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యవసాయ శాఖామాత్యులు తుమ్మల నాగేశ్వరరావు రాజేంద్రనగర్‌లో లాంఛనంగా ప్రారంభించారు. మే 18 నుండి 23 వరకు అడ్వాన్స్ బుకింగ్ చేసుకున్న రైతులు తమకు కేటాయించిన విక్రయ కేంద్రాల నుంచి విత్తనాలు తీసుకెళ్లాలని ఉపకులపతి సూచించారు. అలాగే, అడ్వాన్స్ బుకింగ్ చేసిన వారికి విత్తనాలు అందించిన తర్వాత మిగిలిన నిల్వలను ఇతర రైతులకు విక్రయిస్తామని తెలిపారు. విత్తనాలు కొనుగోలు చేయాలనుకునే రైతులు ముందుగా సంబంధిత కేంద్రాల ఇన్‌చార్జ్‌లను సంప్రదించి లభ్యత వివరాలు తెలుసుకోవాలని సూచించారు. ప్రతి రైతు విత్తనం కొనుగోలు సమయంలో విశ్వవిద్యాలయం అధికారిక రశీదు మరియు సంబంధిత సాంకేతిక పత్రాన్ని తప్పనిసరిగా పొందాలని అధికారులు తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, విక్రయ కేంద్రాల్లో క్రమశిక్షణ పాటిస్తూ విత్తనాలు కొనుగోలు చేయాలని విశ్వవిద్యాలయం విజ్ఞప్తి చేసింది.

# వీధి ఆహార విక్రేతలకు భద్రతా శిక్ష

**110 మందికి ధ్రువపత్రాలు.. పరిశుభ్రత సామగ్రి పంపిణీ**




**శేరిలింగంపల్లి, విశాల భారతి:** శేరిలింగంపల్లి మండల పరిధిలోని 110 మంది వీధి ఆహార విక్రేతలకు ఆహార భద్రతపై శుక్రవారం శిక్షణ నిర్వహించారు. మండల పాలనాధికారి నారాయన్ అమిత్, అదనపు పాలనాధికారి సుభద్ర దేవి, మండల ఆహార భద్రత అధికారుల ఆధ్వర్యంలో ఆహార భద్రత, ప్రమాణాల చట్టం, 2006 ప్రకారం ఈ కార్యక్రమం జరిగింది. ఆహార తయారీలో పరిశుభ్రత, సురక్షిత నిల్వ, వ్యక్తిగత శుభ్రత, వ్యర్థాల నిర్వహణపై విక్రేతలకు అవగాహన కల్పించారు.శిక్షణ పూర్తిచేసిన విక్రేతలందరూ 'ఆహార భద్రత పర్యవేక్షకుడు' పరీక్షలో ఉత్తీర్ణులై ధ్రువపత్రాలు పొందారు. వారికి గ్లౌజులు, టోపీలు, ఆప్రాన్లు, సబ్బులు, చెత్తబుట్టలతో కూడిన పరిశుభ్రత కిట్లను అధికారులు అందజేశారు. దేశీయ ఆహార సంస్థ, భారత వీధి విక్రేతల జాతీయ సంఘం సహకారంతో ఈ శిక్షణ నిర్వహించారు. వీధి ఆహారాన్ని మరింత నాణ్యంగా, పరిశుభ్రంగా అందించడంతో పాటు విక్రేతల ఆదాయం పెంచడమే లక్ష్యమని మండల పాలనాధికారి అమిత్ తెలిపారు. రానున్న రోజుల్లో మరింత మంది విక్రేతలకు శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు.

# తాటి మ్యూజికల్ ఫెస్టివల్ రద్దు

**గీత కార్మికుల అభ్యున్నతే లక్ష్యం.. నిర్వాహకుడు రాందేవ్ రావు**



**విశాలభారతి :చేవెళ్ల :** వరంగల్‌కు చెందిన వ్యాపారవేత్త రాందేవ్ రావు ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని భావించిన "తాటి మ్యూజికల్ ఫెస్టివల్" ను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. గీత కార్మికుల అభ్యున్నతి, తాటి చెట్లు మరియు కల్లు సంస్కృతికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావాలన్న లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని ప్రణాళిక చేసినట్లు ఆయన తెలిపారు. రాందేవ్ ఇప్పటికే "ఎక్స్‌పీరియం" పేరుతో ఒక ప్రత్యేక పార్క్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ ప్రాజెక్టుకు సినీ ప్రముఖులు ఎస్.ఎస్. రాజమౌళి, ప్రభాస్, చిరంజీవి మద్దతు తెలిపినట్లు పేర్కొన్నారు. పార్క్ ప్రారంభోత్సవానికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరై అభినందించినట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా అరుదైన తాటి చెట్ల జాతులను సేకరించి, గీత కార్మికుల సమస్యలపై అధ్యయనం చేసినట్లు రాందేవ్ వెల్లడించారు. కల్లు సహజసిద్ధమైన పానీయం కాగా, దాన్ని తెలంగాణ ప్రత్యేక పానీయంగా గుర్తించాలని డిమాండ్ చేశారు. అంతర్జాతీయ ప్రమాణాలతో శుభ్రత, నాణ్యత కలిగిన కల్లు అందిస్తే యువత, ఐటీ ఉద్యోగులు కూడా ఆదరిస్తారని అభిప్రాయపడ్డారు. అయితే, కొంతమంది గౌడ్ సంఘాల నాయకులు ఫెస్టివల్‌ను వ్యతిరేకిస్తూ ఆరోపణలు చేయడంతో వివాదం నెలకొంది. గీత కార్మికుల హక్కులను దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్నారనే ఆరోపణలను ఆయన ఖండించారు. ఈ పరిణామాల నేపథ్యంలో లక్షల రూపాయలు ఖర్చు చేసి ప్రణాళిక చేసిన ఫెస్టివల్‌ను రద్దు చేస్తున్నట్లు తెలిపారు. గీత కార్మికుల వృత్తికి గౌరవం కల్పించడంతో పాటు, కల్లు విక్రయాలకు మరింత గుర్తింపు రావడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రాందేవ్ కోరారు.

# రైతు వ్యతిరేక ప్రభుత్వంపై బీజేపీ ఫైర్..!

**తరుగు-తేమ దోపిడీ ఆపాలి.. కొనుగోలు కేంద్రాల నిర్లక్ష్యంపై తహసీల్దార్‌కు బీజేపీ వినతిపత్రం**



**విశాల భారతీ, అబ్దుల్లాపూర్మెట్ :** రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు సమస్యలపై బీజేపీ తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసింది. కొనుగోలు కేంద్రాల్లో నెలకొన్న జాప్యం, రైతులకు కనీస సౌకర్యాల లేమి, అలాగే తరుగుతేమ పేరుతో జరుగుతున్న దోపిడీపై ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ హయత్‌నగర్ డివిజన్ భారతీయ జనతా పార్టీ నాయకులు హయత్‌నగర్ మండల తహసీల్దార్ (ఎంఆర్ఓ)కు వినతిపత్రం సమర్పించారు. హయత్‌నగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షులు గంగాని శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. రైతులు రాత్రింబవళ్లు కష్టపడి పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు.


**రైతులను దోచుకునే విధానాలు ఆపాలి**

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షులు వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ...రైతుల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. కొనుగోలు కేంద్రాల్లో సరైన సదుపాయాలు లేక రైతులు నానా అవస్థలు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. తరుగుతేమ పేరుతో రైతుల పంటను తగ్గించి కొనడం దారుణమని, ఈ దోపిడీని వెంటనే అరికట్టాలని డిమాండ్ చేశారు. రైతులు పండించిన ప్రతి గింజను యుద్ధ ప్రాతిపదికన కొనుగోలు చేసి వెంటనే చెల్లింపులు చేయాలని, లేదంటే బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

**బీజేపీ నాయకుల సమక్షంలో వినతిపత్రం**

ఈ కార్యక్రమంలో మన్సూరాబాద్ మాజీ కార్పొరేటర్ కొప్పుల నర్సింహా రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కళ్లెం రవీందర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి బండారి భాస్కర్, హయత్‌నగర్ ప్రభారీ కొత్త రవీందర్ గౌడ్, సీనియర్ నాయకులు కుంట్లూర్ వెంకటేష్ గౌడ్, జక్కిడి ప్రభాకర్ రెడ్డి, మన్సూరాబాద్ డివిజన్ అధ్యక్షులు హరీష్ రెడ్డి, వనస్థలిపురం అధ్యక్షులు కటకం క్రాంతి, మహిళా నాయకులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# భద్రాద్రి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ చైర్మన్‌గా గద్దల రమేష్ నియామకం



**భద్రాద్రి ప్రతినిధి, విశాలభారతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ చైర్మన్ గా గద్దల రమేష్ ను నియమిస్తూ శుక్రవారం గాంధీ భవన్ లో జరిగిన మీడియా సమావేశంలో రాష్ట్ర ఎస్సీ సెల్ చైర్మన్ కవ్వంపల్లి సత్యనారాయణ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్గా గద్దల రమేష్ పేరును ప్రకటించినారు ఈ సందర్భంగా గద్దల రమేష్ మాట్లాడుతూ నా కష్టానికి దక్కిన ఫలితం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ చేసింది నిరంతరం కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడి అనేక పార్టీ కార్యక్రమములు చేసుకుంటూ ముందుకు వెళ్లానని పార్టీ అధికారంలో లేని సమయంలో ఇప్పుడు ఉన్న ప్రతి పక్ష పార్టీ ఆనాడు అధికారం వారి చేతుల్లో ఉందని నన్ను అనేక ఇబ్బందులకు గురి చేయడం అదే విధంగా అనేక అక్రమ కేసులు నాపై పెట్టడం జరిగింది. అయిన కూడా దేనికి భయపడకుండా పార్టీ సిద్ధాంతాలు నమ్ముకుని పార్టీ కోసం శ్రమించానని పార్టీ నన్ను గుర్తించి నాకు ఈ పదవి ఇవ్వడం చాలా సంతోషంగా ఉందని నా మీద నమ్మకంతో పదవి ఇచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు రేవంత్ రెడ్డికి,ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క,రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి,వ్యవసాయ,సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు,భద్రాద్రి జిల్లా డిసిసి అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న,అటవీశాఖ కార్పొరేషన్ చైర్మన్ పొదెం వీరయ్య కు నా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపినారు.

# కరక గూడెం మండల తుడుం దెబ్బ నూతన కమిటీ ఎన్నిక



**విశాల భారతి న్యూస్ :** కరకగూడెం మండల కేంద్రంలో తుడందెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి పోలేబోయిన వెంకటనారాయణ గారి అధ్యక్షతన జరిగిన సమావేశంలో, ఆదివాసి హక్కుల పోరాట సమితి *తుడుం దెబ్బ రాష్ట్ర అధ్యక్షులు మైపతి అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో కరకగూడెం మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నిక చేయడం జరిగింది. కరకగూడెం మండలంలోని అన్ని గ్రామాలు, గూడెం ల సమన్వయంతో ఈ నూతన కమిటీని తీర్మానించి ఎన్నిక చేయడం జరిగింది. ఆదివాసి హక్కుల పరిరక్షణ, జాతి అభివృద్ధి మరియు రాజ్యాంగ హక్కుల సాధన కోసం కమిటీ సమిష్టిగా పనిచేయాలని సమావేశంలో నిర్ణయించారు.





# అట్టహాసంగా ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక జిల్లా స్థాయి వేడుక

**సమిష్టి కృషితో సత్వర ప్రగతి సాధిద్దామని ఎమ్మెల్యేల పిలుపు**



**నిజామాబాద్:**

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా శుక్రవారం నిజామాబాద్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో జిల్లా స్థాయి సమావేశాన్ని అట్టహాసంగా నిర్వహించారు. ప్రభుత్వ సలహాదారు పోచారం శ్రీనివాస్ రెడ్డి, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ గుప్తా, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి, నగర మేయర్ ఉమారాణి, కలెక్టర్ ఇలా త్రిపాఠి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, అదనపు కలెక్టర్లు కిరణ్ కుమార్, దిలీప్ కుమార్, డీఆర్ఓ గీత, అన్ని శాఖల అధికారులు, సర్పంచ్ లు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. జయజయహే తెలంగాణా గేయాలాపనతో సమావేశానికి శ్రీకారం చుట్టి, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సందేశాన్ని చదివి వినిపించారు. వివిధ శాఖల జిల్లా అధికారులు తమతమ శాఖల ద్వారా అమలవుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల గురించి నివేదిక చదివి వినిపించారు. పంట రుణాల మాఫీ, రైతు భరోసా, రైతు బీమా, సన్నాలకు బోనస్ చెల్లింపు, ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణాలు, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, రేషన్ కార్డుల పంపిణీ, గృహజ్యోతి, చేయూత పెన్షన్లు, స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాలు తదితర పథకాల అమలు వల్ల జిల్లాలో ప్రయోజనం పొందుతున్న లబ్దిదారుల వివరాలను వెల్లడించారు. వచ్చే విద్యా సంవత్సరం జూన్ 12వ తేదీ నుండి ప్రభుత్వం నూతనంగా అమలు చేయనున్న అల్పాహారం పథకం, ఇంటర్మీడియట్ కాలేజీలలో సైతం మధ్యాహ్న భోజనం అమలు, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు, తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు తదితర అంశాల గురించి తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, గడిచిన రెండున్నర సంవత్సరాలలో జరిగిన ప్రగతి, ఇకముందు చేపట్టబోయే అభివృద్ధి గురించి ప్రజలకు తెలియజేస్తూ పాలనలో వారిని భాగస్వాములు చేయాలనే సంకల్పంతో రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని చేపట్టిందని అన్నారు. 99 రోజుల స్పష్టమైన కార్యాచరణతో గ్రామ స్థాయి నుండి, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయి వరకు సమావేశాలు నిర్వహించడం ద్వారా క్షేత్రస్థాయిలో అన్ని వర్గాల ప్రజల అభిప్రాయాలను తెలుసుకోవడం, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై అవగాహన పెంపొందించాలన్నదే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పరస్పర సమన్వయంతో వ్యవహరిస్తూ, ప్రజలను భాగస్వాములు చేసి సమిష్టిగా కృషి చేసినప్పుడే సత్వర ప్రగతి సాధ్యపడుతుందని సూచించారు. ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు పంట మార్పిడి దిశగా దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. పంటల సాగులో క్రిమిసంహారక మందుల వాడకాన్ని తగ్గించి, సేంద్రీయ ఎరువుల వినియోగాన్ని పెంచాలని, తద్వారా ప్రజల ఆరోగ్యాలను పరిరక్షించినవారు అవుతారని అన్నారు. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి మాట్లాడుతూ, అనేక ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం పేదల అభ్యున్నతే ధ్యేయంగా పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. నిరుపేద కుటుంబాల సొంతింటి కలను సాకారం చేయాలనే తపనతో మొదటి విడతలో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి 3500 చొప్పున ఇందిరమ్మ ఇళ్ళను మంజూరు చేశారని, త్వరలోనే రెండవ విడతగా ఇందిరమ్మ ఇళ్ళను మంజూరు చేయనుందని, నిబంధనలను సైతం సడలించడం జరిగిందని వివరించారు. రైతులను ఆదుకోవాలనే కృత నిశ్చయంతో కొనుగోలు కేంద్రాలను విరివిగా ఏర్పాటు చేసి వరి ధాన్యం, ఇతర వ్యవసాయ ఉత్పత్తులను సేకరించడం జరిగిందని గుర్తు చేశారు. మండుటెండలను సైతం లెక్క చేయకుండా జిల్లాలో అధికార యంత్రాంగం 7లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసిందని, చక్కటి సమన్వయం, సమిష్టి కృషితోనే ఇది సాధ్యమయ్యిందని అభినందించారు. రైతులు కూడా సంప్రదాయ వరి సాగుకు బదులు అధిక లాభాలను అందించే ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని పిలుపునిచ్చారు. నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ గుప్తా మాట్లాడుతూ, ప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగా కృషి జరగాల్సిన అవసరం ఉందని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో అర్హులైన వారందరికి చేరినప్పుడే ప్రజలకు ప్రయోజనకరంగా ఉంటుందని, ఈ దిశగా అధికారులు అంకితభావంతో కృషి చేయాలని అన్నారు. ప్రత్యేకించి నిజామాబాద్ నగరంలో అసంపూర్తి పనులను త్వరితగతిన పూర్తి చేసేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని, ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణాలు, డబుల్ బెడ్ రూమ్ ల కేటాయింపు విషయంలోనూ అర్బన్ సెగ్మెంట్ పై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని అధికారులకు సూచించారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు తమ హక్కులు, బాధ్యతలను గుర్తెరిగి ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని కోరారు. ప్రత్యేకించి మహిళా సర్పంచ్ లు, కార్పొరేటర్ లు, కౌన్సిలర్లు సమర్ధవంతంగా పని చేస్తూ, తమకు లభించిన అవకాశాన్ని పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని, కుటుంబ సభ్యుల జోక్యానికి తావులేకుండా చూసుకోవాలని హితవు పలికారు. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల గౌరవానికి భంగం వాటిల్లకుండా జిల్లా యంత్రాంగం తరపున కృషి చేస్తామని భరోసా కల్పించారు. ప్రజలకు ఉపయుక్తంగా నిలిచే పనులను చేపట్టి, సకాలంలో అవి పూర్తయ్యేలా చొరవ చూపాలని, నిధులను పూర్తి స్థాయిలో సక్రమంగా వినియోగం అయ్యేలా చూడాలన్నారు.



# విషపూరిత ఫార్మాసిటీకి కాంగ్రెస్ సర్కార్ గుడ్‌బై..!

- **ఫ్యూచర్ సిటీతో రంగారెడ్డి జిల్లాకు కొత్త దిశ**
- **ప్రజాపాలనతో పేదలకు భరోసా.. సంక్షేమ పథకాల అమలులో అధికారులు బాధ్యతగా పనిచేయాలి**
- **జిల్లా స్థాయి సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి వ్యాఖ్యలు**



**విశాల భారతీ, అబ్దుల్లాపూర్మెట్ :**

రంగారెడ్డి జిల్లా భవిష్యత్తును ప్రమాదంలోకి నెట్టేలా గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిపాదించిన విషపూరిత ఫార్మాసిటీ ప్రాజెక్టును కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా రద్దు చేసి, ప్రపంచ స్థాయి ఫ్యూచర్ సిటీ నిర్మాణానికి నాంది పలికిందని ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ, భవిష్యత్ తరాల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కొంగరకలాన్‌లోని రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించిన జిల్లా స్థాయి సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశానికి శాసనమండలిలో చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు ప్రకాశ్ గౌడ్, అరికెపూడి గాంధీ, యాదయ్య, ఈర్లపల్లి శంకర్, కసిరెడ్డి నారాయణరెడ్డి, కార్పొరేషన్ ఛైర్మన్లు మల్ రెడ్డి రాంరెడ్డి, చల్లా నరసింహారెడ్డి, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు.

**99 రోజుల ప్రణాళికపై లోతైన సమీక్ష**

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన ప్రణాళిక అమలు తీరుపై సమావేశంలో సమగ్ర చర్చ జరిగింది. రైతు భరోసా, రైతు బీమా, ఇందిరమ్మ ఇళ్లు, మహాలక్ష్మి, గృహజ్యోతి, సామాజిక భద్రత పెన్షన్లు, రేషన్ కార్డుల పంపిణీ వంటి సంక్షేమ పథకాల పురోగతిని అధికారులు వివరించారు. వరి పంటకు ప్రభుత్వం అందిస్తున్న బోనస్ ద్వారా జిల్లాలో 1,464 మంది రైతులు లబ్ధి పొందినట్లు అధికారులు వెల్లడించారు. అలాగే లక్షా 5 వేల 978 కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేసినట్లు తెలిపారు.

**అప్పుల తెలంగాణను అభివృద్ధి తెలంగాణగా మారుస్తున్నాం**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ.. గత ప్రభుత్వం తెలంగాణను అప్పుల కుప్పగా మార్చి వెళ్లిపోయిందన్నారు. అయినప్పటికీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని కేంద్రబిందువుగా చేసుకుని ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా పేదల సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటోందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి పథకం అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు.

**లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ**

సమావేశం అనంతరం కలెక్టర్, ఎమ్మెల్యేలు కలిసి పలువురు లబ్ధిదారులకు సంక్షేమ పథకాల చెక్కులు పంపిణీ చేశారు. ప్రజల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ప్రజాప్రతినిధులు స్పష్టం చేశారు.

# రెవెన్యూ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



**నిజామాబాద్:** తలసేమియా పేషంట్ల కోసం ఉద్యోగ సంఘాలు, స్వచ్ఛంద సంస్థల ద్వారా రక్తదాన శిబిరాలు నిర్వహించాలని జిల్లా పాలనాధికారి ఇలా త్రిపాఠి ఇచ్చిన పిలుపును పురస్కరించుకుని తెలంగాణా రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్, హెల్పింగ్ హార్ట్స్ ఫౌండేషన్ ల ఆధ్వర్యంలో శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి ఈ శిబిరాన్ని ప్రారంభించగా, పెద్ద సంఖ్యలో రెవెన్యూ ఉద్యోగులు, అసోసియేషన్ ప్రతినిధులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేశారు. తలసేమియా రోగులను ఆదుకోవాలనే తపనతో రక్తదాన శిబిరం నిర్వహించడం గొప్ప విషయమని ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, జిల్లా రెవెన్యూ అధికారిణి బి.గీత, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్, రెవెన్యూ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రమణ్ రెడ్డి, కలెక్టరేట్ ఎ.ఓ ప్రశాంత్ కుమార్, రెడ్ క్రాస్ ప్రతినిధి బుస్స ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# సెంట్రింగ్ కార్మికులకు మద్దతు



**సికింద్రాబాద్, విశాల భారతి:** సెంట్రింగ్ కార్మికుల కు మద్దతు గా కంటెస్టెడ్ కార్పొరేటర్ మేకల కీర్తిహర్షకిరణ్ ధర్నా లో పాల్గొని సంఘీభావం తెలిపారు . సెంట్రింగ్ కార్మికుల డిమాండ్లు న్యాయమైనవని వాటి సాధన కోసం పూర్తి మదత్తు తెలుపుతున్నామని వారు తెలిపారు.

# సికింద్రాబాద్ అభివృద్ధి పనులపై అధికారులతో సమావేశం




**సికింద్రాబాద్, విశాల భారతి :** సికింద్రాబాద్ జీహెచ్ఎంసీ జోనల్ కార్యాలయంలో జోనల్ కమిషనర్ మంగతాయారు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ ఇన్‌చార్జ్ అదం సంతోష్ కుమార్ పాల్గొని నియోజకవర్గంలోని పెండింగ్ అభివృద్ధి పనుల పై అధికారులతో చర్చించారు. రోడ్లు, డ్రైనేజీ, పారిశుద్ధ్యం, వీధి దీపాలు, తాగునీటి సరఫరా తదితర సమస్యలను అధికారుల దృష్టికి తీసుకుపోయారు.

# సత్తుపల్లి జీఎం కార్యాలయంలో అన్ని విభాగాలు ఏర్పాటు చేయాలి

- **సింగరేణి సీఎండీకి జీఎం ద్వారా ఐఎన్టీయూసీ నేత తీగల క్రాంతి కుమార్ వినతి**
- **ఉద్యోగుల ఇబ్బందులపై యాజమాన్యానికి వినతి**
- **కొత్తగూడెం వెళ్లాల్సి వస్తోందని ఆవేదన.. పీవీఎన్ కాలనీ సమస్యల పరిష్కారానికి డిమాండ్**




**సత్తుపల్లి, విశాలభారతి :** స్థానిక సత్తుపల్లి పట్టణంలోని సింగరేణి సత్తుపల్లి ఏరియా జనరల్ మేనేజర్ చింతల శ్రీనివాస్‌ను ఐఎన్టీయూసీ జాయింట్ జనరల్ సెక్రటరీ తీగల క్రాంతి కుమార్ కలిశారు. సింగరేణిలో సత్తుపల్లి ఏరియాలో ఉద్యోగులు, అధికారులను సమన్వయపరుస్తూ ఉత్పత్తి, రవాణా సాధనకు కృషి చేస్తున్న ఏరియా రథసారథి చింతల శ్రీనివాస్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తూ అభినందనలు తెలిపారు. క్రాంతి కుమార్ మాట్లాడుతూ సింగరేణి సంస్థ ఉత్పత్తిలో కీలక పాత్ర పోషిస్తున్న ఉద్యోగుల సంక్షేమానికి యాజమాన్యం మరింత కృషి చేయాలని కోరారు. ముఖ్యంగా నూతనంగా ఏర్పడిన సత్తుపల్లి జనరల్ మేనేజర్ కార్యాలయంలో పూర్తిస్థాయిలో అన్ని డిపార్ట్మెంట్లు ఏర్పాటు చేయాలని సింగరేణి సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌కు జనరల్ మేనేజర్ ద్వారా వినతిపత్రం అందజేశారు. సత్తుపల్లిలో జీఎం కార్యాలయం ప్రారంభించినప్పటికీ వివిధ డిపార్ట్మెంట్లు ఏర్పాటు చేయకపోవడంతో ఉద్యోగులు సుమారు 90 కిలోమీటర్లు ప్రయాణించి కొత్తగూడెం వెళ్లాల్సి వస్తోందని తెలిపారు. జీఎం కార్యాలయంలో పర్సనల్ డిపార్ట్మెంట్, ఫైనాన్స్ డిపార్ట్మెంట్‌తో పాటు ఇతర విభాగాలను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయాలని కోరారు. అదేవిధంగా సింగరేణి సంస్థ వార్షిక ఉత్పత్తి లక్ష్య సాధనలో సత్తుపల్లి ఏరియా నుంచి అత్యధిక ఉత్పత్తి, రవాణా జరుగుతున్న నేపథ్యంలో ఉద్యోగుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని విజ్ఞప్తి చేశారు. స్థానికంగా ఉద్యోగులు నివసిస్తున్న పీవీఎన్ కాలనీ ప్రారంభించి సంవత్సరాలు గడుస్తున్నా సమస్యలు పరిష్కారం కాకపోవడంతో ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పీవీఎన్ కాలనీలో పార్కింగ్ రూఫ్ షెడ్, కమ్యూనిటీ హాల్, ఇండోర్ స్టేడియం, స్విమ్మింగ్ పూల్, వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలని కోరారు.



# పెద్ది నుండి స్పెషల్ సాంగ్

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న భారీ చిత్రం 'పెద్ది' పై రోజురోజుకీ అంచనాలు మరింత పెరుగుతున్నాయి. గ్రామీణ నేపథ్యంతో రూపొందుతున్న ఈ క్రీడా ప్రధాన కథా చిత్రం కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. దర్శకుడు బుచ్చిబాబు సానా తెరకెక్కిస్తున్న ఈ చిత్రానికి సంబంధించిన ప్రచార కార్యక్రమాలను చిత్రబృందం వేగవంతం చేసింది. రేపు భోపాల్‌లో భారీ స్థాయిలో సంగీత వేడుక జరగనున్న నేపథ్యంలో చిత్రబృందం అభిమానులకు సర్‌ప్రైజ్ ఇచ్చింది. సినిమాలోని ప్రత్యేక గీతం "హెల్లల్లలో" అనే పాటకి సంబంధించిన ప్రోమో విడుదల చేశారు. ఇందులో రామ్ చరణ్, శృతి హాసన్ స్టెప్పులకి ఫ్యాన్స్‌కి మాంచి కిక్ ఇచ్చాయి. ఫుల్ సాంగ్ మార్చి 23న రానుంది.ఈ పాటకు ప్రముఖ గేయరచయిత అనంత శ్రీరామ్ సాహిత్యం అందించగా, ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన సంగీత దర్శకుడు ఏ.ఆర్. రెహమాన్ సంగీతాన్ని సమకూర్చారు. ఆయన సంగీతం అంటేనే ప్రేక్షకుల్లో ప్రత్యేకమైన ఆసక్తి ఉంటుంది. అందులోనూ ఇది ప్రత్యేక గీతం కావడంతో ఈ పాటపై భారీ అంచనాలు ఏర్పడ్డాయి. రేపు జరగనున్న సంగీత వేడుకలో ఈ పాటను అధికారికంగా విడుదల చేయనున్నారు. ఈ పాటలో ఇంకో కథానాయిక కూడా కనిపించనున్నట్లు సామాజిక మాధ్యమాల్లో చర్చ నడుస్తోంది. అయితే ఆమె ఎవరు అన్న విషయం మాత్రం చిత్రబృందం ఇంకా రహస్యంగానే ఉంచింది.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gangarapu Vijay. RNI No APTEL/2010/32877.